ప్రతిపక్షం
www.prathipaksham.in

బుధవారం 18.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 329 పేజీలు:10 | ₹5

నేడు ఇండియా, నెదర్లాండ్స్ మ్యాచ్ 10

@prathipaksham | prathipaksham tv telugu

ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్నస్థితి నుంచి ప్రపంచ జీవవైజ్ఞానిక రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతుంది. అందుకు తెలంగాణ ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం. తెలంగాణ ఎదుగుతోంది. ఈ ఎదుగుదలలో భాగస్వాములు కావాలి. జీవవైజ్ఞానిక రంగంలో ప్రస్తుతం వస్తున్న ఆధునిక మార్పులను గమనిస్తే, పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్నమధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం ఉంది. ఆయా సంస్థలు, కార్పొరేట్లు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. ఆ వాతావరణాన్ని తెలంగాణ అందిస్తుంది. అందుకు హైదరాబాద్ అనుకూలమైంది.

-సీఎం రేవంత్‌రెడ్డి

జీవవైజ్ఞానిక రాజధానిగా

హైదరాబాద్

ప్రపంచ అగ్రగామి క్లస్టర్లతో పోటీపడుతున్నాం

- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు గమ్యస్థానం హైదరాబాద్
- ఈ ఎదుగుదలలో భాగస్వాములు కావాలి
- ప్రపంచ దిగ్గజ కంపెనీలు, శాస్త్రవేత్తలు, నిపుణులకు సీఎం పిలుపు
- బయో ఆసియా సదస్సును ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగ నిపుణులను సత్కారం
- బ్రూస్ లెవిన్ జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు అందజేత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 17: వ్యాక్సిన్ తయారీలో ప్రపంచ రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను జీవవైజ్ఞానిక రాజధానిగా ఎదిగేందుకు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బయోఏషియా 2026 సదస్సు వేదికగా జీవవిజ్ఞాన రంగానికి చెందిన ప్రపంచ దిగ్గజ కంపెనీలు, శాస్త్రవేత్తలు, నిపుణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ దేశంలోని మిగతా రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతోందని, ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా మారిన హైదరాబాద్‌ను ఇప్పుడు అందరం కలిసి సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదామని కోరారు. హైదరాబాద్ హైటెక్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన 23వ బయో ఏషియా అంతర్జాతీయ సదస్సును ముఖ్యమంత్రి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ప్రధానంగా 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రపంచస్థాయి సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. "ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్నస్థితి నుంచి ప్రపంచ జీవవైజ్ఞానిక రాజధానిగా హైదరాబాద్

...:: మిగతా 2లో

డాటా సెంటర్లకు రాయితీలపై

అధ్యయనం చేయండి

- భూ పరిహారం నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

...:: 2లో

ప్రజాభవన్ ముట్టడి

హామీల అమలుపై 'జాగృతి' గర్జన

- మహిళలు, వృద్ధులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి
- హామీల అమలుకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి
- బీఆర్ఎస్, బీజేపీ పొత్తుకు మున్సిపల్ ఎన్నికలు తొలిమెట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- హామీల అమలుకు డిమాండ్.. వరుస కార్యక్రమాలకు జాగృతి ప్రణాళికలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 17: బీఆర్ఎస్, బీజేపీ పొత్తుకు మున్సిపల్ ఎన్నికలు తొలిమెట్టు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బీఆర్ఎస్ మద్దతుతోనే బీజేపీ రాష్ట్రంలో ఒకటో, రెండో మున్సిపల్ చైర్మన్ పదవులు దక్కించుకుందన్నారు. ఈ రెండు పార్టీల పొత్తుపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలు నిజమని మున్సిపల్ ఎన్నికల్లో తేలిందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని, వృద్ధాప్య, దివ్యాంగ సహా ఇతర పింఛన్లను పెంచాలని, కళ్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇవ్వాలని, యువతులకు స్కూటీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి మహిళా విభాగం నాయకులు, మహిళలతో కలిసి మంగళవారం బేగంపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ను ముట్టడించారు. ప్రజాభవన్ ఎదుట ఎండలో బైఠాయించి కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ జోక్యం చేసుకొని మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు సహా ఇతర

...:: మిగతా 2లో

ఏఐ టెక్నాలజీ కళ్లజోడు

ఏఐ స్టార్టప్ 'సర్వమ్ ఏఐ' దేశంలోనే తొలి ఏఐ టెక్నాలజీ కండ్ల జోడును విడుదల చేసింది. ఢిల్లీలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'ను ప్రారంభించిన ప్రధాని మోదీ, అత్యంత అధునాతన ఏఐ కండ్ల జోడు 'సర్వమ్ కేజ్'ను ధరించినట్టు సదరు కంపెనీ చీఫ్ ప్రత్యూశ్ కుమార్ మీడియాకు తెలిపారు.

9

బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ ప్రమాణం

దశాబ్దాల పాటు షేక్ హసీనా, ఖలేదా జియాల ఆధిపత్యంలో బంగ్లాదేశ్ రాజకీయాలు సాగగా మొదటిసారి ఎన్నికల్లో ఓ కొత్త వ్యక్తి పోటీచేసి ప్రధానిగా ప్రమాణం చేయడం చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంది.

9

ఇండియా, ఫ్రాన్స్ రక్షణ ఒప్పందం

భారత్, ఫ్రాన్స్ తమ 10 ఏళ్ల రక్షణ సహకార ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవడంతో పాటు, అత్యాధునిక 'హామర్' క్షిపణులను భారత్‌లోనే తయారు చేసేందుకు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి.

9

హీరోయిన్ ప్రత్యూష మృతి కేసు..

నాలుగు వారాల్లో లొంగిపోండి

- నిందితుడు సిద్ధార్థ రెడ్డికి సుప్రీంకోర్టు ఆదేశం
- హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సమర్థించిన న్యాయస్థానం

...:: 5లో

క్యాతన్ పల్లిలో బీఆర్ఎస్ ఆందోళన

కాంగ్రెస్‌ఖాతాలో మరో 7 మున్సిపాలిటీలు

- 11 మున్సిపాలిటీలలో 8 చోట్ల చైర్మన్, వైస్ చైర్మన్‌ఎన్నిక
- మూడు మున్సిపాలిటీలలో ఎన్నికలు వాయిదా
- ఎనిమిదిలో కాంగ్రెస్ 7, ఒకటి బీఆర్ఎస్ కైవసం
- రెండు చోట్ల లాటరీ.. కాంగ్రెస్ ను వరించిన అదృష్టం
- పలుచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఆందోళనలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 17: మిగిలిని 11 మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్7 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. సోమవారం వాయిదా పడిన 11 మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు సర్వశక్తులు ఒడ్డాయి. పలుచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఆందోళనకు దిగారు. కోరం లేకపోవడంతో మంగళవారం సైతం మూడు చోట్ల అధికారులు ఎన్నికలు వాయిదా వేశారు. ఇల్లందు మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. చైర్మన్‌గా దొడ్డ కిరణ్‌మిత్ర, వైస్ చైర్మన్‌గా పెండేల రాజు ప్రమాణ స్వీకారం చేశారు. కాగజ్‌నగర్ మున్సిపల్ పీఠాన్ని బీజేపీ మద్దతుతో హస్తం పార్టీ దక్కించుకుంది. కాగజ్ నగర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ చెందిన షాహిన్ సుల్తానా ఎన్నికయ్యారు. డోర్నకల్ మున్సిపాలిటీని కాంగ్రెస్

...:: మిగతా 3లో

భారత్ ఫ్యూచర్ సిటీలో 'హెల్త్ సిటీ'

- ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా అభివృద్ధి
- కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ తో మారుమూల ప్రాంతాలకు వైద్యం
- రాష్ట్రంలో ప్రతి పౌరుడికి హెల్త్ ప్రొఫైల్
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 17: అంతర్జాతీయ ప్రమాణాలతో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచేలా భారత్ ఫ్యూచర్ లో సిటీలో ప్రత్యేకంగా 'హెల్త్ సిటీ'ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ సాయంతో మారుమూల ప్రాంతాలకూ వైద్య సౌకర్యాలను చేర్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని వివరించారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సోమవారం టీ హబ్ లో 'టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'టీఏఎల్ హాస్పిటల్స్ హెల్త్ ఫెస్ట్ 2026' ఫైర్ సైడ్ చాట్ లో మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడికి హెల్త్ ప్రొఫైలింగ్ ను అందుబాటులోకి

...:: మిగతా 3లో

'క్యూర్' పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

- అసంపూర్తి 'డబుల్' ఇండ్ల పూర్తికి చర్యలు
- మార్చి చివరి నాటికి లబ్ధిదారుల ఎంపిక
- ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 17: హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలో ఇందిరమ్మ

...:: మిగతా 3లో

ఏప్రిల్‌లో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు!

దేశంలో శాసనసభ పదవీ కాలం ముగియనున్న మరికొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నది.

9

ప్రతిపక్షం
Prathipaksham.in
2
హైదరాబాద్
బుధవారం
18.02.2026
@prathipaksham
prathipakshamtvtelugu

రాష్ట్రీయం

ప్రజాభవన్ ముట్టడి

మొదటిపేజీ తరువాయి

వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయించాలని నినాదాలు చేశారు. జాగృతి నాయకుల ప్రజాభవన్ ముట్టడితో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ప్రజావాణి అధికారులతో చర్చించి కల్వకుంట్ల కవిత సహా ఆందోళనకారులను ప్రజాభవన్ లోపలికి అనుమతించారు. కవిత సహా మహిళా నాయకులు ప్రజావాణి స్పెషల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్ ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ, కరీంనగర్, నారాయణపేట్ లో బీఆర్ఎస్ హాజరుకాకపోవడంతోనే బీజేపీకి మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులు దక్కాయన్నారు. బీఆర్ఎస్, బీజేపీల అంతర్గత సహకారం ఈ ఎన్నికలతో బహిర్గతం అయ్యిందన్నారు. నారాయణపేటలో జాగృతి నాయకురాలికి దక్కాల్సిన వైస్ చైర్ పర్సన్ పదవిని రెండు పార్టీలు కలిసి రాకుండా చేశాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరులో బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తామని గతంలో లీకులు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీల అమలుకు ఈ బడ్జెట్ లోనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యమకారులు సహా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో సెక్రటేరియట్, అసెంబ్లీ ముట్టడిస్తామని.. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలం అయ్యింది కాబట్టే నిలదీసేందుకు ఈరోజు ప్రజాభవన్ కు వచ్చామన్నారు. రోజూ ప్రజావాణిలో ప్రజలను కలుస్తానని చెప్పి సీఎం ఒక్క రోజు మాత్రమే ఇక్కడికి వచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను గుర్తు చేసేందుకు ప్రజాభవన్ కు వచ్చిన తెలంగాణ జాగృతి మహిళా, విద్యార్థి విభాగం నాయకుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు, దుర్భాషలాడారని.. పోలీసులు పద్ధతి మార్చుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. జాగృతి నాయకులను ఇక్కడికి పంపి వినతిపత్రం ఇద్దామని అనుకున్నామని, తమ నాయకులను అరెస్టు చేస్తేనే ఇక్కడి వరకు రావాల్సి వచ్చిందన్నారు. ప్రజాభవన్ కు వచ్చిన ప్రతి ఒక్కరి దగ్గర అప్లికేషన్ ఫాంలతో పాటు ఆధార్ కార్డులు ఉన్నాయన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే దాదాపు పూర్తి స్థాయి బడ్జెట్ ఇదేనని అందుకే ఆ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రైతులకు బోనస్ ఇచ్చి అదేదో ఘనకార్యంగా ఈ ప్రభుత్వం చెప్పుకుంటోందని.. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి కేవలం సన్నవడ్లకే బోనస్ ఇస్తూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను ఎగవేసే ప్రయత్నం చేస్తే జాగృతి ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీస్తుందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడం సంగతి తర్వాత ముందు ఇస్తామన్న రూ.2,500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అంగన్ వాడీల్లో రాజకీయ జోక్యం సరికాదు

అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణలో రాజకీయ జోక్యం ఉండేలా ప్రభుత్వం జీవో ఇచ్చిందని, దానిని వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ పరిధిలో పనిచేస్తున్న అంగన్ వాడీలను గ్రామ పంచాయతీల పరిధిలోకి తేవడం సరికాదన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించే అంగన్ వాడీలను యథాతథంగా కొనసాగించాలని కోరారు. అంగన్ వాడీ టీచర్లు, వర్కర్లు ప్రభుత్వం ఏ పని అప్పగించినా కష్టపడి పనిచేస్తారని.. అలాంటి వారిని ఇబ్బంది పెట్టే చర్యలకు ఫుల్ స్టాప్ పెట్టాలన్నారు. ఇకనైనా అంగన్ వాడీలను అవమానించే చర్యలు ఆపాలన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీల జీతాలు చెల్లించకుండా సంక్షేమ పథకాలకు నిధులు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి చెప్తున్నారని.. ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు అంగన్ వాడీలు, ఆశా కార్యకర్తలకు వేతనాలు ఇవ్వకపోవడం ఎలా సమంజసమవుతుందో చెప్పాలని నిలదీశారు. అంగన్ వాడీలు, ఆశా కార్యకర్తలు సహా చిన్న ఉద్యోగులకు వేతనాల పెంపుపై ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. ఆందోళనలో పెద్ద ఎత్తున మహిళలు, తెలంగాణ జాగృతి నాయకులు పాల్గొన్నారు.

హామీలకు బడ్జెట్ కేటాయింపులపై జాగృతి ప్రత్యేక కార్యాచరణ

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ జాగృతి ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ భాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ నిర్వహించింది. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు సహా ఇతరులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం ప్రజాభవన్ ముట్టడించారు. విద్య, వైద్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం సాధికాత, మహిళా సాధికారత, రైతు రుణమాఫీ సంపూర్ణ అమలు సహా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు బడ్జెట్ కేటాయింపులు చేయాలని కోరుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే నాటికి పలు కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. రానున్న రెండు వారాలు బడ్జెట్ కు నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళన, నిరసన కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు భవాని వేముల, మాధవి మరిపల్లి, డి. కవిత, వై. రామాదేవి, లలిత యాదవ్, శ్రావణి, మనోజా, కృష్ణవేణి సూరరాపు, వరలక్ష్మి, లక్ష్మీ శ్రావణి పాల్గొన్నారు.

నగరంలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయండి

- త్వరలో వార్డుల్లో పర్యటిస్తా.. విధుల్లో నిర్లక్ష్యం సహించం
- ప్రకటనల ఆదాయం పెంపుపై కసరత్తు చేయండి
- మల్టీలెవల్ పార్కింగ్, స్కైవాక్ మార్కెట్లపై అధ్యయనం చేయండి
- కమిషనర్లు, జోనల్ కమిషనర్లు పొద్దునే ఫీల్డ్ లో ఉండాలి
- పురపాలక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 17: తెలంగాణ కోర్ అర్బన్ ప్రాంతం (క్యూర్) లోని మూడు నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారు. పరిశుభ్రత విషయంలో క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలన చేస్తానని, ఎక్కడైనా చెత్త కనపడితే సహించమని అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్ర పర్యటనలు చేయాలని ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. మూడు నగర పాలక సంస్థల పరిధిలో ప్రకటనల ఆదాయం పెంపు పాలసీపై సమీక్షించారు. వివిధ అంశాలపై ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. "నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపై ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలి. నెక్లెస్ రోడ్డు పక్కన పలు ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలి" అని స్పష్టం చేశారు. ప్రకటనలకు సంబంధించి పెద్ద మొత్తంలో వివిధ రకాల బోర్డులు కనిపిస్తున్నా ఆశించిన ఆదాయం రాకపోవడంపై ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూర్లలోని ప్రకటనల ఆదాయంతో నగరంలో వస్తున్న ఆదాయాన్ని బేరీజు వేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ప్రకటనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రకటనలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని సూచించారు. ఈ సందర్భంగా పీపీపీ, ఇతర నమూనాల్లో ఆదాయం సమకూర్చుకునే అంశంపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దానిని పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. మూడు నగర పాలక సంస్థలతో పాటు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ సిస్టమ్ అనుసరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్పొరేషన్ల పరిధిలోని పార్కుల వివరాలు, వాటి అభివృద్ధిపైన ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లతో త్వరలోనే ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలను సమగ్రంగా వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు ఆర్‌వి కర్ణన్, శ్రీజన, వినయకృష్ణారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

“

2014లో నన్ను అస్సాం సీఎం చేయాలని నాటి కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ అనుకున్నారు. కానీ రాహుల్ వల్ల మొత్తం మారిపోయింది. తేదీ నిర్ణయించుకోమని మేడమ్(సోనియా) చెప్పారు. జూన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తానన్నా. యూఎస్ లో ఉన్న రాహుల్ పార్టీ నాయకులతో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత పరిస్థితి మారిపోయింది.
- హిమంత బిశ్వ శర్మ, అస్సాం సీఎం

జీవవైజ్ఞానిక రాజధానిగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

ఎదుగుతుంది. అందుకు తెలంగాణ ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం. తెలంగాణ ఎదుగుతోంది. ఈ ఎదుగుదలలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. "జీవవైజ్ఞానిక రంగంలో ప్రస్తుతం వస్తున్న ఆధునిక మార్పులను గమనిస్తే, పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం ఉంది. ఆయా సంస్థలు, కార్పొరేట్లు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు." అని సీఎం అన్నారు. ఆ వాతావరణాన్ని తెలంగాణ అందిస్తుందని, అందుకు హైదరాబాద్ అనుకూలమైందని, బల్క్‌డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచస్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందని వెల్లడించారు. "తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి. జీసీసీలను స్థాపించండి. ఆవిష్కరణ కేంద్రాలను నిర్మించండి. మాలిక్యూల్స్ , ఔషధాలను డిజైన్, క్లినికల్ అనలిటిక్స్‌ను ప్రారంభించండి. AI ప్లాట్‌ఫామ్‌లను, డిజిటల్ తయారీ రంగాలను ముందుకు తీసుకెళ్లండి. అందుకు ప్రభుత్వం, యంత్రాంగం, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయంలో భాగస్వాములుగా ఉంటారు." అని సీఎం ప్రకటించారు. 23 ఏళ్ల కిందట బయోఏషియా ప్రారంభమైనప్పుడు హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ, సాఫ్ట్ వేర్ నగరంగా గుర్తింపు ఉండేదని, ఇప్పుడు హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా కూడా నిలిచిందని అన్నారు. దూరదృష్టి కలిగిన నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థలు ఉండటం వల్ల హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు, పరిశోధన, డిజైన్ రంగాల్లో ప్రపంచ కేంద్రంగా ఎదిగిందని అన్నారు. తెలంగాణలో గడిచిన రెండేళ్లలో జీవవిజ్ఞాన రంగంలో రూ. 73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని, ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా తెలంగాణ నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించామని తెలిపారు. జినోమ్ వ్యాలీని విస్తరించామని, అలాగే, ప్రపంచ స్థాయి పరిశోధనలు, ఆవిష్కరణల కోసం వన్‌బయోను ప్రారంభించామన్నారు. "జీవవైజ్ఞానిక రంగంపై మా ఆలోచనలను తెలంగాణతో పాటు మీ అందరితో పంచుకుంటున్నాను. ఇటీవలే మేం "తెలంగాణ రైజింగ్ 2047" విజన్‌ను ఆవిష్కరించాం. తెలంగాణ 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నది మా లక్ష్యం." అని అన్నారు. గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేస్తూ అనేక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని. ఒక బలమైన సంకల్పంతో ఈ పురోగతిని సాధించామని, అందుకు ప్రత్యక్ష నిదర్శనమే బయోఏషియా 2026 సదస్సు అని సీఎం తెలిపారు. ఇప్పుడు బయోఏషియా తన పరిధిని విస్తరించుకుని "బయోవరల్డ్"గా మారుతోందని, ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 500 ప్రముఖ సంస్థలు, దాదాపు 4 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, హెల్త్‌కేర్ రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ సదస్సులో పాల్గొన్నారని అన్నారు. హైదరాబాద్ లో జరుగుతున్న ఈ సదస్సు దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న విశ్వాసం నాకుంది" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ నలుమూలల నుంచి బయోఏషియా సదస్సుకు హాజరైన ప్రతినిధులకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్ గారికి జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు2026 అందించారు.

లైఫ్ సైన్సెస్ రంగానికి సహకారం

లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించి హైదరాబాద్‌లో పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ రంగంలో హైదరాబాద్ కేంద్రంగా ఇప్పటికే అనేక సంస్థలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేశాయని పారిశ్రామిక వేత్తలకు వివరించారు. హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మక బయోఏషియా 2026 ప్రపంచస్థాయి సదస్సు ప్రారంభమైన సందర్భంగా ముఖ్యమంత్రి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. జీవవైజ్ఞానిక రంగంలో జీసీసీలు, ముఖ్యంగా ఇన్నొవేషన్ సెంటర్ల ఏర్పాటుకు అనుగుణంగా భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకమైన జోన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారు. ఈ సందర్భంగా పెట్టుబడులకు సంబంధించి పలు ఒప్పందాలు జరిగాయి. గ్లోబల్ కన్స్యూమర్ హెల్త్‌కేర్ కంపెనీ అయిన ఒపెలా హెల్త్‌కేర్, 42 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీసీసీ త్వరలోనే కార్యకలాపాలను విస్తరించనుంది. ఈ సంస్థ వచ్చే ఏడాదిలోపు 500 ఉద్యోగాలను కల్పించనుంది. ఇండొనేషియాకు చెందిన జేపీఎఫ్ఏ అంతర్భాగమైన వాక్సిండో ఎనిమల్ హెల్త్‌కేర్ విభాగం జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక బీఎస్ఎల్3 వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది. ఈ కేంద్రం కోళ్లు, పశువులు, స్వైన్, ఆక్వాకల్చర్ రంగానికి అవసరమైన వ్యాక్సీన్లను ఉత్పత్తి చేస్తుంది. ప్రముఖ ఏఐ, డేటా సైన్స్ కంపెనీ ట్రిడెన్స్ ఇన్‌కార్పొరేషన్ హైదరాబాద్ కేంద్రంగా ఏఐఆధారిత హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్‌పై కార్యకలాపాలను విస్తరించనుంది. ఈ కేంద్రం సుమారు 18 వేల చ. అడుగుల ప్రత్యేకమైన ఇన్నొవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తుంది. భారతదేశ లైఫ్ సైన్సెస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో పెద్ద ఎత్తున లైఫ్ సైన్సెస్ క్యాంపస్‌ను నెలకొల్పుతుంది. దాదాపు 12 ఎకరాల స్థలంలో 1 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంతో అన్ని మౌలిక సదుపాయాలతో అత్యాధునిక పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తుంది. వచ్చే ఆరేళ్లలో ఈ సంస్థ పూర్తిస్థాయి కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

ఈ భేటీలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి నిర్మలా జగ్గారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాజకీయం

గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు

- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు సీఎం కప్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 17 : తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్ 2025-26 కు సాంకేతిక హంగులు సమకూర్చి క్రీడాకారులకు ఇష్టమైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయడం సంతోషకరమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్లో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్, సీఎం కప్ యాప్'నీలమణి'ని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోని బాలాదేవి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ క్రీడా రంగానికి పెద్ద పీట వేసే లక్ష్యంతో మట్టిలో మాణిక్యాలను గుర్తించే విధంగా తెలంగాణ క్రీడా శాఖ సీఎం కప్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువకులు, విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా మైదానాలకు తరలి రావాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దాదాపు నాలుగున్నర లక్షల మంది క్రీడాకారులు గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా స్థాయిలో పాల్గొని అందులోంచి 22,000 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. క్రీడాకారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేసే విధంగా సీఎం కప్ గేమ్స్ పేరిట నీలమణి యాప్ ద్వారా ఏఐ కాల్ సెంటర్ ద్వారా 24 గంటల సమాచారాన్ని క్రీడాకారులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. 44 క్రీడాంశాలు 12 జిల్లాల వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోటీలు విజయవంతం కావాలని ఈ క్రీడలనుంచి మంచి ఛాంపియన్లు వృద్ధిలోకి రావాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు పలువురు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫైర్ సేఫ్టీ విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని హాస్టళ్ల నిర్వాహకులకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వస్తున్నది వేసవి కాలం అని, ఏమాత్రం పొరపాటు జరిగినా పెనుముప్పు సంభవిస్తుందని, ఇటీవల నగరంలో జరిగిన అగ్నిప్రమాదాలే ఇందుకు నిదర్శనమన్నారు. నగరంలో ఉన్న హాస్టళ్లు చాలావరకు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని ఫిర్యాదుల నేపథ్యంలో అగ్నిప్రమాదాలపై హైడ్రా మంగళవారం ఓ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించింది. - ప్రతిపక్షం, హైదరాబాద్

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే శంకర్

- షాద్‌నగర్ విజయం సీఎంకు అంకితం

ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి 17: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఈ విజయాన్ని ముఖ్యమంత్రికి అంకితం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ అభివృద్ధి కార్యక్రమాలు, పట్టణానికి అవసరమైన పలు అంశాలపై ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే శంకర్ చర్చించారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

డాటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయండి

- భూ పరిహారం నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 17: డాటా సెంటర్ల ఏర్పాటు విషయంలో వివిధ రాష్ట్రాలు కొనసాగిస్తున్న రాయితీలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాటా సెంటర్లకు భూ కేటాయింపులో హేతుబద్ధత ఉండాలని సూచించారు. రాష్ట్రంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు, వారికి అవసరమైన భూమి, ఇతర వసతులపై సీఎం రేవంత్‌డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షించారు. వివిధ ప్రాంతాల్లో డాటా సెంటర్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సాగుతున్న భూ సేకరణపై అధికారులను ఆరా తీశారు. భూ పరిహారం నిర్ణయించే విషయంలో ఉదారంగా ఉండాలని అధికారులకు సూచించారు. రైతులతో మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిహారం నిర్ణయించాలన్నారు. రూ. వేల కోట్లతో పెట్టుబడులు పెట్టే సంస్థలు భూమిపై పెట్టె పెట్టుబడి చాలా స్వల్పమన్నారు. కంపెనీలకు సకాలంలో భూమి, ఇతర వసతులు అందుబాటులో ఉంచితే త్వరగా పనులు పూర్తి చేసుకుంటారని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారత్ ఫ్యూచర్ సిటీలో 'హెల్త్ సిటీ'

మొదటిపేజీ తరువాయి

తీసుకొస్తున్నామన్నారు. మహిళలందరికీ ముందస్తు క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలను మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. అక్కడికొచ్చే రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందేలా టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్ గా తెలంగాణను మార్చాలనే సంకల్పంతో ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. హెల్త్ కేర్ రంగంతో పాటు ఇతర రంగాల్లోనూ ఆర్అండ్ డీకి పెద్దపీట వేసేందుకు దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత 'తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్' ను ప్రారంభించామన్నారు. మరో మూడు నుంచి నాలుగు నెలల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ ను లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. హైదరాబాద్ కు ధీటుగా రాష్ట్రంలోని టైర్ 2, టైర్ 3 నగరాలను కూడా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. ఈ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. వరంగల్, ఆదిలాబాద్ లో కొత్త విమానాశ్రయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. హెల్త్ కేర్ రంగంలో టెక్నాలజీ మిళితం చేసి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టే ఆవిష్కర్తలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందని, తమతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని వారిని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాయి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఖాతాలో మరో 7 మున్సిపాలిటీలు

మొదటిపేజీ తరువాయి

పార్టీ దక్కించుకుంది. మున్సిపల్ చైర్ పర్సన్‌గా కొండేటి రాజకుమారి, వైఎస్ చైర్ పర్సన్ గా మాద లావణ్యను ఎన్నుకున్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ సైతం కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంది. సుల్తానాబాద్ మున్సిపాలిటీ చైర్మన్‌గా బిరుదు కృష్ణ, వైస్ చైర్‌పర్సన్‌గా పుష్పలత ఎన్నికయ్యారు. జహీరాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ దక్కించెకోగా, చైర్మన్‌గా యూనుస్ ఎన్నికయ్యారు. ముగ్గురు స్వతంత్రులు, ఇద్దరు ఎంఐఎం సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎంపీ సురేష్ షెట్కార్ ఓటు వేశారు.

లాటరీలో కాంగ్రెస్‌కు వరించిన అదృష్టం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ఉత్కంఠ మధ్య జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. రెండుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బలాబలాలు సమానంగా ఉన్నాయి. దీంతో అధికారులు లాటరీ తీశారు. లాటరీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్మన్ అభ్యర్థుల పేర్లు రావడంతో ఆ 2 మున్సిపాలిటీలూ కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. కాగా, సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీని మాత్రం బీఆర్ఎస్ దక్కించుకుంది. చైర్‌పర్సన్‌గా కె. ప్రమీల, వైస్ చైర్మన్‌గా హరీశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.

క్యాతన్ పల్లిలో ఉద్రిక్తత

క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక వాయిదా పడింది. ఇరువర్గాల గొడవతో ప్రత్యేకాధికారి సతీష్ కుమార్ ఎన్నిక వాయిదా వేశారు. కోరం వచ్చినా అధికారులు ఎన్నిక నిర్వహించలేదు. ఎన్నిక చేపట్టాలని బీఆర్ఎస్ (10), సీపీఐ (4) సభ్యులు డిమాండ్ చేశారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీ పార్టీ అభ్యర్థులతో కలిసి బయటకు వెళ్లారు. ఎన్నికల గదిలో బీఆర్ఎస్ సభ్యులు తమపై దురుసుగా ప్రవర్తించారని వివేక్ ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రమాణ స్వీకారం తర్వాత అధికారులు కావాలని 10 నిమిషాలు విరామం ఇచ్చారని, తమని కిడ్నాప్ చేయాలని కాంగ్రెస్ పథకం వేసిందని ఆరోపించారు. ఎన్నిక జరిగే సమావేశంలో మంత్రి వివేక్ ప్రసంగించడానికి అధికారులు అవకాశం ఇచ్చారని, బీఆర్ఎస్, సీపీఐ బలాన్ని చూసి వివేక్ జీర్ణించుకోలేక పోయారని విమర్శించారు. సజావుగా జరపాల్సిన ఎన్నికలను ఉద్దేశ్యపూర్వకంగానే వాయిదా వేశారని అన్నారు.

ఇబ్రహీంపట్నం, ఖానాపూర్ వాయిదా

నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోనూ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. రెండో రోజు కోరం లేకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఎస్ఈసీ వాయిదా వేసింది. ఎన్నికపై హైకోర్టు నుంచి స్టే రావడంతో అధికారులు వాయిదా వేశారు. 19 వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కౌన్సిలర్ యాదగిరి కుమారుడు కిడ్నాప్‌పై హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఎల్లుండిలోపు యాదగిరిని తమ ఎదుట హాజరుపర్చాలని హైకోర్టు ఆదేశించింది. అనూహ్యంగా ఉదయం బీఆర్ఎస్ క్యాంపులో కౌన్సిల్ ఎన్నికకు యాదగిరి హాజరయ్యారు.చైర్మన్ ఎన్నిక పూర్తయిన తర్వాత అధికారులకు కోర్టు ఆదేశాలు అందాయి. స్టే కారణంగా బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థికి ధ్రువీకరణపత్రం ఇవ్వలేదు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేశాయి.

కన్నీళ్లు పెట్టుకున్న ఎర్రబెల్లి ...

తొర్రూర్ మున్సిపాలిటీ కోల్పోవడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఉద్రిక్తత తలెత్తడంతో దయాకర్ రావును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తానేం సమాధానం చెప్పాలని కన్నీళ్లు పెట్టుకున్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పని చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల మధ్య ఘర్షణ కారణంగా ఎన్నిక వాయిదా వేసినట్లురిటర్నింగ్ అధికారి సతీష్‌ప్రకటించారు.

షరతులతో ఐబొమ్మ రవికి హైకోర్టు బెయిల్

- రోజూ సీసీఎస్ ఎదుట హాజరుకావాలని ఆదేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 17: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మూవీ పైరసీ కేసులో ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రోజూ సీసీఎస్ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని, దేశం విడిచి వెళ్లొద్దని ఆంక్షలు విధించింది. రవి ఇంటర్‌నెట్ వినియోగంపై కోర్టు పూర్తి స్థాయిలో ఆంక్షలు విధించింది. అతడు ఎలాంటి ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని సొంతంగా వాడకూడదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి వస్తే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. కాగా, రవి సినిమా పైరసీ, కాపీ రైట్, ఐటీ యాక్ట్‌తో పాటు మనీ లాండరింగ్ సహా.. మొత్తం ఐదు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతడు రెండు రకాలుగా సినిమా ప్రింట్‌లను కొనుగోలు చేసేవాడు. నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించేవాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు కనుగొన్నారు. బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఇక ఐబొమ్మ రవి సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు పంపినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ నగదు లావాదేవీలన్నీ ఐబొమ్మ రవి డాలర్ల రూపంలోనే చేసినట్లు గుర్తించారు.

మహిళల హక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం అమానుష వైఖరి

- తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి భవానీ వేముల

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 17: మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిరసన తెలిపితే పోలీసులు అమానుషంగా వ్యవహరించారని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి భవానీ వేముల మండి పడ్డారు. ప్రజా భవన్ ముందు నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా వ్యవహరించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలతో ఎలాంటి బాధ్యతా భావన లేదని తీవ్రంగా విమర్శించారు. గత ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు ప్రతి నెల ₹2,500 ఇస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ రెండు ఏళ్ల తర్వాత కూడా హామీని అమలు చేయకపోవడం ఆందోళనకు కారణమై ఉంది. జాగృతి ఆధ్వర్యంలో మహిళలు ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలను గుర్తు చేస్తే, పోలీసులు అమానుషంగా, వృద్ధ మహిళలను దారుణంగా ప్రహరించి, నేరుగా చూడకుండా ఈడ్చుకుపోయారని ఆరోపించారు. వృద్ధ మహిళల పట్ల దారుణంగా ప్రవర్తించడం దారుణమన్నారు. ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

క్యాతన్‌పల్లి పాలకవర్గం ఎన్నిక మళ్లీ వాయిదా

- కాంగ్రెస్, బీఆర్ ఎస్ పరస్పర దాడులు
- ఉత్కంఠ రేపుతున్న చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, ఫిబ్రవరి 17: మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటి పాలకవర్గం సమావేశం తిరిగి మళ్లీ వాయిదా పండింది. మంగళవారం పాలకవర్గం ఎంపిక కోసం అధికారులు మున్సిపల్ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎంపికకు అధికారులు అన్ని సిద్ధం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, సీపీఐ పార్టీ కలిసి పొత్తు పెట్టుకొని పోటి చేశాయి. 24 వార్డులు ఉండగా బీఆర్ఎస్‌కు పది స్థానాలు, సీపీఐ 4 గెలువగా కాంగ్రెస్ 7 స్థానలతో పాటు ఒక కాంగ్రెస్ రెబల్ గెలిచారు. 7వ వార్డు రెబల్ అభ్యర్థి తిరిగి మంత్రి వివేక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 16న ఎంపిక కోసం ఎవరికి వారే క్యాంప్ రాజకీయాలు నిర్వహించారు. సమయానికి కౌన్సిలర్లు రాకపోవడంతో తిరిగి మంగళవారం రోజున ఎంపిక జరుగుతున్నదనుకుంటే అటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు మోహరించడంతో పోలీసులు 163 చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చారు. దీంతో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, తన అనుచరులతో వస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆయన వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పరం దాడులకు దిగడంతో పాటు రాళ్లు రువ్వుకున్నారు. దీంతో పోలీసుల భారీ బందోబస్తు మధ్య ఎంపికైన కౌన్సిలర్లు కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపాలిటిలో మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ ఎక్స్ అఫీషియో నమోదు చేయడంతో మున్సిపల్ కార్యలయానికి వెళ్లారు. కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం పూర్తయినత తరువాత కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ మొదలు పెట్టిన వెంటనే కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు గొడవపడ్డారు. ఒక్కసారిగా రణరంగంగా మారడంతో అధికారులు చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక వాయిదా వేశారు. సభ్యులం ఉన్నప్పటికి చట్టవిరుద్ధంగా వ్యహరిస్తున్నారని బీఆర్ఎస్, సీపీఐ నాయకులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, సీపీఐ నాయకులు ఇది అన్యాయమని అన్నారు. గత పది సంవత్సరాలుగా రౌడీ యిజం చేస్తున్న బాల్కసుమన్ నా పై రాళ్లు రువ్వాడని మంత్రి వివేక్ వెంకటస్వామి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

'క్యూర్' పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

మొదటిపేజీ తరువాయి

ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మార్చి చివరి నాటికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి మంగళవారం సమీక్షించారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని, హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని, హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగంమంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలిందని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్ధిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకనుగుణంగా నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చేస్తున్నామని, వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారివారి ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు వంటి వివరాలతో పది రోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని, జేఎనఎన్‌యూ ఆరఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిధిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆ లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చు చేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ మంజూరు చేస్తుందని తెలిపారు. చాలాచోట్ల ఇండ్లు తీసుకొని అక్కడ నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని, అలాగే బోగస్ లబ్దిదారులను కూడా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనర్హుల స్థానంలో రాజకీయాలకతీతంగా సమీపంలో ఉన్న అర్హులైన పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. 2 బీహెచ్‌కే నివాస ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్దిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఓఆర్ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని, ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు.

ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించలేదు. వారిది ప్రపంచంలోనే బలమైన సైనిక శక్తి అని యూఎస్ అధ్యక్షుడు చెబుతున్నారు. అలాంటి శక్తి కూడా తీవ్రంగా దెబ్బతినొచ్చు. మళ్లీ కోలుకోదు. యుద్ధనౌకలు ప్రమాదకరమే. కానీ వాటిని సముద్రం అడుగుకు పంపగల ఆయుధాలు ఇంకా ప్రమాదకరం. మా అణు పరిశ్రమ దేశాన్ని నడిపించేందుకే. యుద్ధానికి కాదు.
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

ఓపెన్ వాయిస్

కృత్రిమ మేధతో భవిష్యత్తు

నలభై ఆరేళ్ల క్రితం అంటే 1980లో దేశంలో కంప్యూటరీకరణను విస్తరింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆందోళనలు తలెత్తాయి. 1984 సంవత్సరాన్ని 'యాంటీ కంప్యూటరైజేషన్ సంవత్సరం'గా పరిగణించారు. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని, ఆర్థికంగా దెబ్బతింటాయని, దేశంలో తీవ్ర పరిస్థితులు తలెత్తుతాయని కార్మికులు నిరసన ప్రదర్శనలు సాగించారు. అయితే రానురాను డిజిటల్ టెక్నాలజీని అమలు లోకి విస్తారంగా తీసుకు రావడంతో సమాజంలోని అన్ని వర్గాల్లో, దేశం మొత్తం మీద ఆలోచనల్లో మార్పు రావడం ప్రారంభమైంది. కంప్యూటర్లు, ఆధునిక సాంకేతికత భారీగా ఉద్యోగాలు కల్పిస్తాయని, జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని నమ్మకం పెరిగింది. ఏఐ (కృత్రిమ మేధ) ఆధునిక ప్రపంచంలో కీలకమైన కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఏఐ గురించే చర్చ వినిపిస్తోంది. మానవ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నో పెద్దమార్పులు వచ్చాయి. కానీ ఇప్పుడు ఏఐ అన్నది అత్యంత శక్తివంతమైన, అతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారత్ అగ్రస్థానం సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రారంభం కావడం చెప్పుకోదగిన ఘట్టం. ఏఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో మనదేశం కీలకంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ఏర్పాటైన ఈ సదస్సు గురించి ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే దేశంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 22 రంగాల్లోని 17 రంగాల కంపెనీలు తమను తాము ఏఐ సాంతికత దిశగా మార్చుకోవలసిన ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఏఐతో ఎక్కువ అనుబంధం ఉన్న ఐటి వంటి రంగాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఏఐ సిఇఒ ముస్తఫా సులేమాన్ వచ్చే 18 నెలల్లో కంప్యూటర్ ఉద్యోగాలన్నీ ఏఐతో భర్తీ అవుతాయని అంచనా వేశారు. ఏఐ వల్ల 2035 నాటికి ప్రపంచ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) లో 15 శాతం పాయింట్లు పెరగవచ్చని ఏడాది క్రితం ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది. అంటే ప్రతి సంవత్సరం సుమారు 1 శాతం అదనపు అభివృద్ధి తథ్యమన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ సదస్సు ఒక బలీయమైన జాతీయ ఏఐ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మాత్రమే ప్రయత్నించకుండా ప్రపంచ దక్షిణార్ధ దేశాలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలన్న తపన కనిపిస్తోంది. ఆయా ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థల అధినేతలు భారతదేశ సామర్థ్యం గురించి ఆశావహులుగా ఉన్నారు. జెన్‌సెన్ హుయాంగ్, గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, తదితరులు భావితరానికి ఏఐ సాంకేతిక కేంద్రంగా భారత్ వర్ధిల్లుతుందని, ఏఐని భారత్ ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయాలతో దృఢమైన విశ్వాసం వెలిబుచ్చడం గమనార్హం. భారత్‌లో మానవ వనరులకు లోటు లేదని, ఏఐ అమలు స్థాయి మరింత ముందుకు వెళ్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఏఐ ఫ్రంట్నర్ చాట్ జిపిటిలో ప్రపంచం మొత్తం మీద రెండో భారీ మార్కెట్‌గా భారత్ ఉంటోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ ఆల్ట్‌మాన్ అంగీకరించారు. ఏఐ నమ్మదగిన ముఖ్యమైన మార్కెట్‌గా అభివర్ణించారు. ఇవన్నీ ఏఐ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి. ఏఐ వల్ల పలు ఉద్యోగాలకు పోతాయని ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రముఖ బిలియనీర్, పారిశ్రామిక వేత్త వినోద్ ఖోస్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ టూల్స్ రాబోయే ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓ ఉద్యోగాలు దాదాపు కనమరుగవుతాయని అంచనా వేశారు. రానున్న 15 ఏళ్లలో నైపుణ్య ఆధారిత వృత్తులు తుడిచిపెట్టుకుపోతాయని హెచ్చరించారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 నేపథ్యంలో హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వినోద్ ఖోస్లా మాట్లాడారు. బిపిఓ లేదా బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ అనేది కంపెనీలు థర్డ్‌పార్టీ సర్వీస్ ప్రొవైడర్లకు అవుట్‌సోర్స్ చేసే లార్జ్ సెగ్మెంట్ వర్క్‌ను సూచిస్తుంది. ఇండియాలోనే ఐటీ సర్వీసెస్‌పై కూడా ఇదే తరహా ప్రభావ ఉంటుందని అంచనా వేశారు. ఏఐ సిస్టమ్స్ ఆర్థికంగా విలువైన పనులలో మానవులను అధిగమించగల స్థితికి వేగంగా చేరుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఏఐ అనేది డిజిటల్ అసిస్టెంట్స్ నుండి అటానమస్ ఏఐ వర్కర్క్ దిశగా మారుతుందని, అకౌంటింగ్, లా, మెడిసిన్, చిప్ డిజైన్ వంటి రంగాలు మరో దశాబ్దకాలంలో ఏఐ వల్ల ప్రభావితం కావచ్చని తెలిపారు. ఈ తరుణంలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఢిల్లీలో ప్రారంభం కావడం శుభోదయమే.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
18.02.2026

ప్రపంచ సంబంధాలన్నీ వాణిజ్య సంబంధాలే

ఇప్పటి వరకు పాక్ సాయంతో, సైనిక మద్దతుతో చిందులేసిన బంగ్లాదేశ్ లోని బి. ఎన్. పి నాయకుడు తారిఖ్ రెహమాన్ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తన స్వరం మార్చుకున్నట్టు కనబడుతున్నది. భారత్ తో స్నేహ సంబంధాలను నెలకొల్పుకుంటానని, బంగ్లా దేశ్ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు కృషి చేస్తానని ప్రకటించడం ముదావహం. ఈ పరిణామాలను బట్టి ఇక నుండి ప్రపంచం వాణిజ్య సంబంధాల చుట్టే తిరుగుతుందనే వాస్తవం బోధపడుతున్నది. అశాంతి, అలజడులతో ఏమీ సాధించలేమని ప్రపంచ దేశాలు గమనించాలి.



సుంకవల్లి సత్తిరాజు
9704903463

ఎన్నో ఆటుపోట్లు, అవాంతరాల మధ్య న్యూఢిల్లీ వాషింగ్టన్ ల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే ఈ ఒప్పందం భారత దేశ ప్రయోజనాలకు భంగకరంగా ఉందని కొందరు, ట్రంప్ స్వదేశంలో ఎదురవుతున్న నిరసనలకు తలొగ్గి భారత్ తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నారని మరికొందరు వాదించడం గమనార్హం. ఇది భారత్ సాధించిన విజయమని భా.జ.పా అనుకూల పక్షాలు భాష్యం చెబుతుంటే, మోడీ ట్రంప్ వత్తిళ్ళకు లొంగిపోయి రాజీ పడ్డారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఏది నిజం? ఏది అబద్ధం? అనే అంశం ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాతే నిర్ధారణ అవుతుంది. ఏది ఏమైనప్పటికీ ట్రంప్ కనీస మర్యాద, దౌత్య విలువలు పాటించకుండా ఏక పక్షంగా వాణిజ్య ఒప్పందం కుదిరిందని చెప్పడమే కాకుండా, ప్రతీ విషయాన్ని ట్రూత్ సోషల్ ద్వారా వెల్లడించడం సముచితం కాదు. భారత్ కూడా ట్రంప్ పోకడలపై తగిన వివరణ ఇవ్వక పోతే ప్రజల్లో కూడా అనుమానాలు రేకెత్తే అవకాశముంది. ఇండో యు.ఎస్ "ట్రేడ్ డీల్" లో కొన్ని సవరణలు చేస్తూ అమెరికా ఫ్యాక్ట్ షీట్ విడుదల చేసింది. 500 బిలియన్ డాలర్ల అమెరికా వస్తూత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందనే ప్రకటనలో కొంత సవరణ చేయడమే కాకుండా భారత్ నుండి దిగుమతి చేసుకునే పప్పు ధాన్యాలపై సుంకాలు తగ్గుతాయనే పదజాలంలో కూడా సవరణలు చేస్తూ కొత్త ఫ్యాక్ట్ షీట్ లో అమెరికా పేర్కొనడం జరిగింది. భారత్ తో ట్రేడ్ డీల్ పట్ల పాక్ సహజం గానే ఆత్మ రక్షణలో పడింది. అమెరికా తమను టాయ్ లెట్ పేపర్ లా వాడుకుని, వదిలేయడం పట్ల పాక్ రక్షణ మంత్రి ఆవేదన చెందడం సహజమే. ఇరుదేశాల మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ వలన ఎవరికి లాభం? ఎవరికి నష్టం అనే అంశాలను పరిశీలిస్తే ఇరు దేశాలకు ఈ ఒప్పందం వలన ప్రయోజనం చేకూరే అవకాశాలున్నాయి. ట్రంప్ ప్రకటనకు మోడీ అంగీకారం తెలియ చేసిన నేపథ్యంలో ఈ ఒప్పందం భారతీయ రైతులకు శాపంగా ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల వస్తూత్పత్తులను కొనడం విశేషమేమీ కాదని భారత్ ప్రకటించింది. మోడీ అభ్యర్థనతోనే తాను ట్రేడ్ డీల్ కు ఒప్పుకున్నానని, రష్యా నుండి చమురు కొనుగోలు నిలుపుదల చేయడానికి, వెనెజువెలా నుండి చమురు కొనుగోలుకు భారత్ అంగీకరించడం వలన ఈ ఒప్పందాన్ని అంగీకరించడం జరిగిందని ట్రంప్ ట్రూత్ సోషల్ లో వెల్లడించగా, సుంకాలను తగ్గించడం పట్ల, ట్రేడ్ డీల్ పట్ల మోడీ కూడా సంతోషం వ్యక్తం చేయడం జరిగింది. ట్రంప్ చెప్పినట్లుగా రష్యా చమురు నిలిపి వేస్తామని, గాని, వెనెజువెలా నుండి చమురు కొనుగోలు చేస్తామని గాని భారత ప్రధాని చెప్పలేదు. రష్యా కూడా భారత్ నుండి చమురు విషయంలో తమకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొనడం విశేషం. ట్రంప్ మాటల్లో వాస్తవమెంత? భారత్ నిజంగానే రష్యా నుండి చమురు కొనుగోలు నిలిపివేసి, ప్రస్తుతం అమెరికా అధీనంలో ఉన్న వెనెజువెలా నుండి ఆయిల్ దిగుమతి చేయనుందా? అనే విషయాలపై భారత ప్రభుత్వం నుండి ఎలాంటి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతానికైతే ఇండో యు.ఎస్ ల మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారైనది. ఈ ఒప్పందం మార్చి నెల నుండి అమల్లోకి రాబోతున్నది. యూరోపియన్ యూనియన్ తో భారత్ చేసుకున్న "ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్" కూడా ఏ ఏడాది

చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో కాని అమల్లోకి వస్తుంది. భారత్ పై ఆగ్రహంతో రగిలి పోయిన ట్రంప్ స్వరం మార్చి మోడీని ప్రశంసించడమే కుండా అమెరికా భారత్ ల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ఈ శతాబ్దం లోనే అతి పెద్ద చారిత్రక ఒప్పందంగా అభివర్ణించడం జరిగింది. భారత్ తో తాము జరిపే 500 బిలియన్ డాలర్ల వాణిజ్యం జీరో సుంకాలతో జరగబోతుందని చెబుతున్న ట్రంప్, భారతీయ వస్తువులపై 18 శాతం సుంకాలు విధించడం ఇరుదేశాల వాణిజ్య వ్యవహారాల్లోని అసమతుల్యతను, భారత్ పట్ల అమెరికా చూపుతున్న వాణిజ్య వివక్షతను చాటి చెబుతున్నది. భారత్ ఈయూ దేశాల" మదర్ ఆఫ్ ఆల్ డీల్స్" పట్ల అప్రమత్తమైన ట్రంప్ ఒక మెట్టుదిగి, పట్టుదల వదలి, భారత్ తో ట్రేడ్ డీల్ కు పచ్చ జెండా ఊపినట్లు అవగతమవుతున్నది. అమెరికాలో ట్రంప్ పట్ల వ్యతిరేకత ఏర్పడడం, ద్రవ్యోల్బణం పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడం, అమెరికా మిత్ర దేశాలు ట్రంప్ కు వ్యతిరేక గళం వినిపించడం, అమెరికా విధించిన రెసిప్రోకల్ టారిఫ్ లను, అధిక సుంకాలను చైనా వంటి దేశాలు లెక్కచేయక పోవడం, రష్యా ట్రంప్ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, ఉక్రెయిన్ పై యుద్ధం కొనసాగించడంతో పాటు అనేక అంశాలు, స్వీయ తప్పిదాలు ట్రంప్ పట్ల వ్యతిరేకతను పెంచాయి. ముఖ్యంగా భారత్ పై 50 శాతం సుంకాలు విధించడం, ఇందులో రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకుంటున్నందుకే ఏకంగా 25 శాతం అదనపు సుంకాలను విధించిన ట్రంప్ ప్రభుత్వం ఇప్పుడు ఈ సుంకాలను 18. శాతానికి పరిమితం చేయడం శుభ సూచకం. మన పొరుగునున్న చైనా, బంగ్లాదేశ్ పాక్ లపై 37, 20,19 శాతం సుంకాలను విధించిన అమెరికా తన మిత్ర దేశాలపై కూడా భారత్ కంటే ఎక్కువ సుంకాలు విధించిన దేశాల జాబితాలో ఉన్నాయి. బ్రెజిల్ పై 50 శాతం, మ్యాన్మార్ పై 40 శాతం టారిఫ్ లు విధించిన అమెరికా ఇప్పుడు భారత్ విషయంలో పన్నుల భారం తగ్గించడం క్షీణిస్తున్న ఇండో యు.ఎస్ ద్వైపాక్షిక సంబంధాలను మెరుగు పరుచుకొనే చర్యల్లో ఒక భాగమే. అమెరికా మొండి పట్టుదల వలన ఇప్పటికే యూరోపియన్ యూనియన్ అమెరికాకు దూరం కావడం జరిగింది. అమెరికా శత్రు దేశాలను, మిత్ర దేశాలనే కాకుండా భిన్న ధృవాలైన ఇరాన్, ఇజ్రాయిల్ పాలస్తీనా లతో పాటు, అరబ్ ఎమిరేట్స్ తోను భారత్ తన ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్నది. దీనిని భారత్ దౌత్య నీతిగా భావించాలా? లేక ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా మోడీ అమెరికా హెచ్చరికలకు లొంగి పోయారా? అనే సంశయం తొలగిపోలేదు. ఆవేశకావేషాలు, ప్రతీకార చర్యలు, పంతాలు, పట్టింపులు భారత ఆర్థికాభివృద్ధికి గొడ్డలి వేటు. ఈ విషయాన్ని గమనించే భారత్ ప్రపంచ దేశాలన్నింటితోను సఖ్యతను కొనసాగిస్తున్నది. అమెరికా వలన భారత్ కు రష్యా తో గల రక్షణ, వాణిజ్య, సాంకేతిక సంబంధాలతో పాటు చారిత్రక, సన్నిహిత సంబంధాలకు విఘాతం కలగకుండా కాపాడుకోవాలి. ఈ ప్రపంచంలో భారత్ కు నమ్మదగిన ఏకైక దేశం రష్యా మాత్రమే. ఎన్ని అడ్డంకులెదురైనా రష్యాతో భారత్ కు గల చిరకాల బంధాన్ని కొనసాగించాలి. ఈ విషయంలో అమెరికా వత్తిడిని భారత్ పరిగణలోకి తీసుకోకూడదు. ఇండో అమెరికా ట్రేడ్ డీల్ వలన భారతీయ వస్తువులకు అమెరికా పెద్ద మార్కెట్ గా అవతరించబోతుంది. భారత దేశంలో తగ్గబోయే వస్తువుల ధరలు, ఇంధన ధరల యొక్క ప్రయోజనాలు నేరుగా వినియోగదారులకు దక్కాలి. భారత దేశంలో ఉపాధి అవకాశాలు, ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలి. ప్రపంచంలో అత్యధిక ఆయిల్ నిల్వలున్న దేశంగా వెనెజువెలా పేరుగాంచింది. 800 సంవత్సరాలకు సరిపడా ఆయిల్ నిల్వలు గల వెనిజువెలాలో చమురు వెలికితీయడంలో హ్యూగో చావెజ్, మదురోలు విఫలమైనారు. ఇప్పుడే వెనిజులా అమెరికా కనుసన్నల్లో ఉండడం వలన ఆయిల్ ను వెలికితీయడం సాధ్యం కావచ్చు. వెనిజులా లో పెట్టుబడులు పెట్టాలని ఇప్పటికే ట్రంప్ భారత్, చైనాలను కోరడం జరిగింది. ఇది సాధ్యమా? పెట్రో డాలర్ వ్యవస్థను రష్యా అంగీకరించి, చమురును డాలర్లలోనే విక్రయించబోతున్నదనే వార్తల్లో నిజానిజాలు తేలాలి. ఏది ఏమైనప్పటికీ యుద్ధాల వలన ప్రయోజనం లేదని, ఆయుధాలు ప్రజల ఆకలిని తీర్చలేవనే సత్యాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాలి. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా కేవలం ఆయుధాలతో, ఉగ్రవాదంతో, అగ్ర దేశాల అవసరార్థ ప్రయోజనాల కోసం తన ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసుకున్న పాక్ కు ప్రస్తుత ప్రపంచ పరిణామాలు గుణపాఠం కావాలి.

ఆత్మ ప్రక్షాళన: రమజాన్ క్రమశిక్షణ వెనుక ఉన్న నిగూఢార్థం

ముహమ్మద్ ముజాహిద్
9640622076

ఆకాశంలో వెండి రేఖలా మెరిసే నెలవంక కేవలం చంద్రుని గమనాన్ని మాత్రమే సూచించదు; అది ఒక లోతైన ఆధ్యాత్మిక పరివర్తనకు నాంది పలుకుతుంది. ఇస్లామిక్ సంప్రదాయంలో, రమజాన్ అంటే కేవలం అన్నపానీయాలను త్యజించడం మాత్రమే కాదు; అది ఆత్మకు శిక్షణ ఇచ్చే ఒక కఠినమైన పాఠశాల. భౌతిక అవసరాలను పక్కన పెట్టి, ఆధ్యాత్మికతకు పట్టం గట్టే ఒక అద్భుత సమయం.

వ్యక్తిత్వానికి ఒక రక్షణ కవచం

ఉపవాసం (సౌమ్) అనేది వ్యక్తిత్వానికి ఒక "డాలు" వంటిది. ఈ డాలు కోపం, అసభ్యత మరియు ఆవేశం అనే బాణాల నుండి విశ్వాసిని కాపాడుతుంది. క్షణికావేశాలకు ప్రాధాన్యత పెరిగిన నేటి ప్రపంచంలో, రమజాన్ మనకు "నిగ్రహాన్ని" పరిచయం చేస్తుంది. ఎవరైనా రెచ్చగొట్టినా లేదా గొడవకు దిగినా, ఎదురు దాడికి దిగకుండా ఎంతో హుందాగా "నేను ఉపవాసం ఉన్నాను" అని చెప్పమని ప్రవక్త (స) బోధించారు. ఇది కేవలం మౌనం కాదు, అత్యున్నత స్థాయి ఎమోషనల్ ఇంటెలిజెన్స్.

సమయం మరియు నిగ్రహాల మేళవింపు

ఈ మాసపు లయ సూర్యుడు మరియు ఆత్మపై ఆధారపడి ఉంటుంది. తెల్లవారుజామున ప్రశాంతంగా తీసుకునే 'సహ్రీ'తో మొదలై, సూర్యాస్తమయం కాగానే అమితానందంతో జరుపుకునే 'ఇఫ్తార్'తో ముగుస్తుంది. ఈ క్రమం మనిషి దైనందిన జీవితంలో ఒక క్రమశిక్షణను నింపుతుంది. అయితే, ఈ క్రమశిక్షణలో గొప్ప మానవీయ కోణం కూడా ఉంది. భారం మోయలేని వారికి ఈ ధర్మం ఎన్నో వెసులుబాట్లను కల్పించింది:

బాటసారులు: సుమారు 42 మైళ్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించే వారికి ఉపవాసం నుండి వెసులుబాటు ఉంది. ప్రయాణంలో కఠినమైన నిష్ఠ కంటే ఆరోగ్యం మరియు సౌకర్యానికే ప్రాధాన్యత ఇవ్వబడింది.

అశక్తులు మరియు బాధితులు: వయస్సు రీత్యా లేదా అనారోగ్యం వల్ల ఉపవాసం ఉండలేని వారు ఒక నిరుపేదకు అన్నదానం (ఫిదియా) చేయడం ద్వారా సమాజానికి తమ వంతు సాయం అందిస్తారు.

మృతుల పట్ల బాధ్యత: మరణించిన వారి పేరున మిగిలిపోయిన ఉపవాసాలను వారి వారసులు పూర్తి చేయడం ద్వారా "దేవుని రుణాన్ని" తీర్చే అవకాశం కల్పించబడింది.

మానవ నైజాన్ని అర్థం చేసుకోవడం

ఉపవాస నియమాలు మానవ సహజమైన మతిమరుపును, బలహీనతలను అర్థం చేసుకుంటాయి:

దైవిక వరప్రసాదం: పొరపాటున లేదా మరిచిపోయి తిన్నా, త్రాగినా ఉపవాసం భంగం కాదు. అది దైవం ప్రసాదించిన ఆహారంగా పరిగణించి, ఉపవాసాన్ని కొనసాగించవచ్చు.

అనురాగపు హద్దులు: ఉపవాస స్థితి పగటివేళ లైంగిక సంబంధాన్ని నిషేధించినప్పటికీ, జీవిత భాగస్వామితో రాత్రిపూట లైంగిక సంబంధం పెట్టుకోవచ్చు. సహ్రీ వేళ కంటే ముందే గుసుల్ స్నానం చేసి పరిశుద్ధమవ్వాలి.

ప్రాయశ్చిత్తం (కఫ్ఫారా): కావాలని నియమాన్ని ఉల్లంఘించిన వారికి కఠినమైన ప్రాయశ్చిత్తం ఉంది—ఒక బానిసను విముక్తి చేయడం, అరవై రోజులు వరుసగా ఉపవాసం ఉండటం లేదా అరవై మందికి అన్నదానం చేయడం. ఇది మనం చేసే ప్రతిజ్ఞ పట్ల ఉండాల్సిన నిబద్ధతను గుర్తు చేస్తుంది.

ఆధ్యాత్మిక శిఖరం: మహారాత్రి

నెల చివరి పది రోజుల్లో భక్తి పరాకాష్టకు చేరుకుంటుంది. చాలామంది 'ఏతెకాఫ్' (మసీదులో తపోనిష్ఠ) ద్వారా ప్రాపంచిక బంధాలను తెంచుకుని దైవానికి దగ్గరవుతారు. ఈ సమయంలోనే వెయ్యి నెలల కంటే విలువైన 'లైలతుల్ ఖద్ర్' (మహారాత్రి) కోసం అన్వేషణ మొదలవుతుంది.

అంతిమ సుగంధం

ఉపవాసకుడి నోటి వాసన దేవుని దృష్టిలో కస్తూరి సువాసన కంటే శ్రేష్ఠమైనదని ప్రవక్త (స) పేర్కొన్నారు. ఈ పోలిక మనకు ఒక విషయాన్ని గుర్తు చేస్తుంది: ఉపవాసంలో మనం పడే భౌతిక కష్టం ఆధ్యాత్మిక సుగంధాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఆకలితో రాటుదేలి, ప్రార్థనతో మెత్తబడి, క్రమశిక్షణతో మెరుగుపడిన హృదయాలతో విశ్వాసులు స్వర్గంలోని 'రయ్యాన్' అనే ద్వారం ద్వారా ప్రవేశించడానికి సిద్ధమవుతారు.

లేఖ

ఔషధ నియంత్రణ వ్యవస్థ విఫలం

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద జనరిక్ మందులు, వ్యాక్సిన్ల సరఫరాదారులలో ఒకటి. ప్రపంచ జనరిక్ ఔషధ ఎగుమతుల్లో దాదాపు 20% వాటా కలిగి ఉంది. భారతీయ ఔషధ కంపెనీలు తాము ఉత్పత్తి చేసే కొత్త ఔషధాల పరీక్షలకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం సులభతరం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ నిబంధనలు వేగవంతమైన ఔషధ ఆవిష్కరణ మరియు ప్రపంచ పోటీతత్వానికి అడ్డంకిగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. భారతీయ ఔషధ కంపెనీలు తయారు చేసే ఔషధాల నాణ్యత నియంత్రణ చాలా పేలవంగా ఉందనే విషయం అందరికీ తెలిసిందే. మధ్య ప్రదేశ్ లో 2025 అక్టోబర్ లో కలుషితమైన జలుబు మందుల కారణంగా కనీసం 16 నుండి 20 మంది పిల్లలు మరణించారు. .1972 లో చెన్నై 1986 లోముంబై, 1988 బీహార్ లో సంవత్సరాలలో ఇలాంటి సంఘటనలు జరిగాయి, నాణ్యత లేనివి పనికిరాని విషపూరితమైన మందులను తీసుకోవడం వల్ల భారతదేశంలో ఎంత మంది మరణించారో అసలు సంఖ్య తెలియదు. జనరిక్ మందులు, దగ్గు సిరప్‌లు, టీకాలు మరియు ఔషధాల కోసం ఉపయోగించే పదార్థాలు వంటి ఓవర్‌దికౌంటర్ ఔషధాలను తయారు చేసే 10,000 కంటే ఎక్కువ ఫార్మాస్యూటికల్ ఫ్యాక్టరీలను దాదాపు 3,000 కంపెనీలు నడుపుతున్నాయి. వార్తాపత్రిక నివేదికల ప్రకారం, 2007 మరియు 2020 మధ్య, కేవలం మూడు రాష్ట్రాల్లోనే 7,500 కంటే ఎక్కువ మందులు నమూనాలను తీసుకున్నప్పుడు నాణ్యత పరీక్షలలో విఫలం చెంది ప్రామాణిక నాణ్యత లేనివి, నాసిరకం మందులుగా ప్రకటించబడ్డాయి. ఈ మందులు తగినంత పదార్థ రసాయనాలు లేకపోవడం, రోగుల రక్తంలో కరిగిపోయే సామర్థ్యం బలహీనపడటం లేదా కలుషితమైనట్లు కనుగొనబడిన కారణంగా పరీక్షలలో విఫలమయ్యాయి. అటువంటి నాసిరకం మందుల వల్ల ప్రభావితమైన రోగుల సంఖ్య లక్షల్లో ఉంటుందని అంచనా వేయబడింది. మార్కెట్లో ఉన్న చాలా మందులు కేవలం. ఔషధాల పరీక్ష కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రయోగశాలలలో అవసరమైన పరికరాలు లేదా అర్హత కలిగిన సిబ్బంది లేరు. 2014లో, దేశంలో 10,300 ఔషధ తయారీ యూనిట్లు ఉన్నాయి, వాటిలో దాదాపు 300 పెద్ద యూనిట్లు ఉన్నాయి. దేశంలో డ్రగ్ ఇన్స్పెక్టర్ల సంఖ్య సుమారు 1,500గా అంచనా వేయబడింది. దీనికి విరుద్ధంగా, ఫార్మా పరిశ్రమను పర్యవేక్షించడానికి అవసరమైన డ్రగ్ ఇన్స్పెక్టర్ల సంఖ్య 20,000గా అంచనా వేయబడింది. గడిచిన సంవత్సరాలలో, భారతీయ ఫార్మా పరిశ్రమ ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమలలో ఒకటిగా ఎదిగినప్పటికీ, ఔషధాల నాణ్యతను నిర్ధారించడం లో విఫలం చెందుతుంది.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్
- ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 17: కేసీఆర్ అంటే కేవలం ఒక పేరు మాత్రమే కాదని, అది తెలంగాణ ఆత్మ గౌరవానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు న్యాయం చేసిన గొప్ప మహనీయుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆయన లేకపోతే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమయ్యేది కాదని అభిప్రాయపడ్డారు. రైతుబంధు, మిషన్ భగీరథ, ఆరోగ్యశ్రీ విస్తరణ, గురుకుల పాఠశాలల స్థాపన వంటి విప్లవాత్మక పథకాల ద్వారా తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందని సతీష్ కుమార్ గుర్తు చేశారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చి సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడిగా కేసీఆర్ ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా విభాగం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబరాలు చేసుకున్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి కోమటిరెడ్డి

- గుండ్రాంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం
- క్షతగాత్రులకు తక్షణ సహాయక చర్యలు

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 17: చిట్యాల మండలం, గుండ్రాంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. శాలిగౌరారం కు చెందిన రమేష్ టిఫిన్ చేసి రోడ్డు దాటుతుండగా ఏపీకి చెందిన వెంకట్ అనే ద్విచక్ర వాహన దారుడు ఢీకొట్టాడు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. నల్గొండ పర్యటన ముగించుకొని హైదరాబాద్ కు వెళుతున్న మంత్రి కోమటిరెడ్డి తన కాన్వాయ్ ని ఆపి క్షతగాత్రులకు సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే అంబులెన్స్ ను రప్పించి చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని మంత్రి వైద్యులను ఆదేశించారు. ఏమీ పట్టనట్లుగా వెళ్లకుండా మంత్రి ఆగి మానవత్వం చాటుకున్నారు. బాధితులకు వేగంగా సేవలు అందించడానికి కృషి చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

హీరోయిన్ ప్రత్యూష మృతి కేసు..

నాలుగు వారాల్లో లొంగిపోండి

- నిందితుడు సిద్ధార్థ రెడ్డికి సుప్రీంకోర్టు ఆదేశం
- హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సమర్థించిన న్యాయస్థానం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 17: సినీనటి ప్రత్యూష కేసులో సుప్రీం కోర్టు తుది తీర్పు వెల్లడించింది. నాలుగు వారాల్లో లొంగిపోవాలని సిద్ధార్థ రెడ్డిని ఆదేశించింది. ఈ కేసులో నిందితుడు సిద్ధార్థ రెడ్డి పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టేసింది. నిందితుడికి హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం..సిద్ధార్థ రెడ్డి లొంగిపోవాలని ఆదేశించింది. హీరోయిన్ ప్రత్యూష భువనగిరిలో ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించింది. కాలేజీ రోజుల్లోనే నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. 1998లో విడుదలైన రాయుడు సినిమాతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత శ్రీరాములయ్య చిత్రంలో కీలకపాత్రలో నటించింది. తెలుగులో స్నేహం అంటే ఇదేరా, కలుసుకోవాలని వంటి చిత్రాలలో నటించి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. ప్రత్యూష కెరీర్ మంచి ఫాంలో ఉండగానే తన ప్రియుడు సిద్ధార్థ రెడ్డితో కలిసి 2002 ఫిబ్రవరి 23న ఆత్మహత్యయత్నం చేసింది. ఈ ప్రయత్నంలో ప్రత్యూష చనిపోగా, సిద్ధార్థ రెడ్డి కోలుకున్నారు. అయితే సిద్ధార్థ రెడ్డి వల్లే తన కూతురు మరణించిందని ఆరోపిస్తూ ప్రత్యూష తల్లి సరోజిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆయనపై కేసు నమోదు చేసుకొని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నాంపల్లిలోని స్థానిక కోర్టు సిద్ధార్థ్ రెడ్డికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. కానీ 2011లో హైకోర్టు శిక్షను రెండేళ్లకు తగ్గించి, జరిమానాను రూ.50,000కి పెంచింది. ఈ తీర్పుతో తన కూతురికి న్యాయం జరగలేదంటూ ఆమె తల్లి సరోజిని 2012లో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ కేసు దర్యాప్తు జరుగుతుంది. మంగళవారం ఈ కేసుపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సమర్థిస్తూ సిద్ధార్థ్ రెడ్డిని పోలీసుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది.

ముంబై వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి

- ముంబై క్లైమెట్ వీక్‌లో పాల్గొననున్న సీఎం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 17: మహారాష్ట్ర రాజధాని ముంబైలో మూడు రోజుల పాటు జరిగే ముంబై క్లైమెట్ వీక్ లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ముంబై క్లైమెట్ వీక్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, హైదరాబాద్ విస్తృత ప్రగతి, పరిపాలన సంబంధిత అంశాల్లో రాష్ట్ర విజయాలను ఈ వేదికపై సీఎం రేవంత్ రెడ్డి వివరించనున్నారు. ముంబై క్లైమెట్ వీక్ అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 నుండి 19 మూడు రోజుల పాటు జరగనుంది. మహారాష్ట్ర ప్రభుత్వం, ముంబై కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సును ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించనున్నారు.

భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూలో చేరాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 17 : భవన నిర్మాణ కార్మికులు సిఐటియు సభ్యులుగా చేరాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని నాగిరెడ్డి గూడ గ్రామంలో అమావాస్య సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం భవన నిర్మాణ కార్మిక సంఘం మొయినాబాద్ మండల అధ్యక్షులు ముంజ గళ్ళ ప్రభుదాస్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై నిరంతరం సిఐటియు పోరాటం చేస్తుందని అన్నారు. భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉందని కార్మికులందరూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని ఇన్సూరెన్స్ కార్డు ఉంటే కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే వెల్ఫేర్ బోర్డు నుంచి ఆర్థిక సహకారం అందుతుందన్నారు. మండల పరిధిలో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు సిఐటియు సభ్యులుగా చేరాలని లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్,భవన నిర్మాణ కార్మిక సంఘం నాగిరెడ్డి గూడ గ్రామ అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ మండల ఉపాధ్యక్షులు కర్ర వెంకటయ్య, జీనుగుంట అశోక్, మహేందర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాశింబౌలిలో వ్యక్తి దారుణ హత్య

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 17 : మొయినాబాద్ మండల పరిధిలోని కాశింబౌలిలో దారుణ హత్య కలకలం రేపింది. రేయిన్బో క్రికెట్ గ్రౌండ్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని గమనించిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో కీలక ఆధారాలు సేకరించారు. మృతుడు ఈశ్వర్ (35)గా గుర్తించారు. గత 20 రోజులుగా జేబీఐటీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈశ్వర్ మొయినాబాద్ సురంగల్‌లో భార్య బోనగిరి మమత, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. ఉపాధి కోసం సూర్యపేట జిల్లా తిరుమలగిరి నుంచి మొయినాబాద్‌కు వచ్చినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అతని భార్య సమీపంలోని పాఠశాలలో హౌస్‌కీపింగ్ ఉద్యోగం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ప్రాంతంలో భద్రతా చర్యలను పోలీసులు కట్టుదిట్టం చేశారు.

రవాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

ప్రతిపక్షం,మొయినాబాద్, ఫిబ్రవరి 17: రవాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మొయినాబాద్ పట్టణ కేంద్రంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ అనుబంధం స్కూల్ బస్సు డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ మొయినాబాద్ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ... రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. సమాజంలో డ్రైవర్లది కీలక పాత్ర అని అనేక ప్రమాదాలలో డ్రైవర్లు చనిపోతున్నారని వారి కుటుంబాలు మొత్తం రోడ్డున పడుతున్నాయని కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్లకు భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా రవణ రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది. స్కూల్ బస్సు డ్రైవర్స్ యూనియన్ మొయినాబాద్ మండల అధ్యక్షులుగా గోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గా శేఖర్ ప్రధాన కార్యదర్శిగా సందీప్, కోశాధికారిగా సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, మల్లేష్, చాంద్ పాషా సహాయ కార్యదర్శిలుగా శేఖర్ వినోద్ కుమార్ సురేందర్ సోషల్ మీడియా బాధ్యులుగా శివ కమిటీ సభ్యులుగా 20 మందిని ఎన్నుకున్నారు.

కౌన్సిలర్‌గా గెలిచినా మీ సేవకుడినే

- 7వ వార్డులో ప్రవీణ్ విజయోత్సవ ర్యాలీ

ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి17: షాద్‌నగర్ పట్టణంలోని 7వ వార్డులో గెలుపొందిన కౌన్సిలర్ కొప్పునూరు ప్రవీణ్ విజయోత్సవ ర్యాలీ అట్టహాసంగా సాగింది. ఆర్టీసీ కాలనీ, ఆనంద్ నగర్, తిరుమల మేఘా టౌన్‌షిప్, సూర్య కాలనీ, ఈశ్వర్ కాలనీ, సాయి బాలాజీ కాలనీ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ ర్యాలీ సాగింది. ఇంటింటికి వెళ్లిన ప్రవీణ్, అక్కలు-అన్నలు-చెల్లెళ్లను ఆప్యాయంగా పలకరిస్తూ ఆశీర్వాదం తీసుకున్నారు. "కౌన్సిలర్‌గా గెలిచినా మీ సేవకుడిగానే ఉంటాను, మీ ఆశీర్వాదం ఇలాగే కొనసాగాలి" అంటూ వంగి వంగి దండాలు పెట్టడం ప్రజలను భావోద్వేగానికి గురి చేసింది. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, "ఈ గెలుపు నా వ్యక్తిగత విజయం కాదు, 7వ వార్డు ప్రజల నమ్మకానికి నిదర్శనం అని అన్నారు. కాలనీల్లో ఉన్న తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు వంటి సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాను" అని హామీ ఇచ్చారు. ప్రజల విశ్వాసం, నాయకుడి వినయం కలిసిన ఈ విజయోత్సవ ర్యాలీ 7వ వార్డులో కొత్త ఆశలకు నాంది పలికింది. గెలిచిన తర్వాత కూడా అదే విధేయత, అదే కృతజ్ఞత చూపిన ప్రవీణ్ తీరు రాజకీయాల్లో విలువలు ఇంకా సజీవంగానే ఉన్నాయనే భావన కలిగించింది.

కార్మికుల క్యాంపుల వద్ద విక్రయించేందుకు గంజాయి నిల్వలు

- 101 కిలోల గంజాయి స్వాధీనం, ఇద్దరి అరెస్టు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 17 : రామచంద్రపురం పరిధిలోని కొల్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కార్మికుల నివాస క్యాంపు షెడ్లలో నిల్వవుంచిన భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నామని శేర్లింగంపల్లి డిసిపి సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా గంజాయిని నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను కొల్లూరు పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ సిబ్బంది సంయుక్తంగా అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బస్వ జగన్నాథం (37), పల్లపు లక్ష్మీనారాయణ (52) అనే వ్యక్తులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి వ్యాపారానికి అలవాటు పడ్డారన్నారు. ఒడిశాకు చెందిన రాజు అనే వ్యక్తి నుంచి సుమారు 101.7 కిలోల గంజాయిని తెప్పించి, తెల్లాపూర్ పరిధిలోని శిల్పా వెంచర్ సమీపంలో కార్మికుల క్యాంపుల వద్ద విక్రయించేందుకు నిల్వ చేశారని పేర్కొన్నారు. ఖచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు మెరుపు దాడి నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 25.72 లక్షల విలువైన గంజాయితో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడు రాజు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కొల్లూరు సీ.ఐ. గణేష్ పటేల్, ఎస్ఓటీ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించి, రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. గంజాయి లేదా మాదకద్రవ్యాల సరఫరాపై సమాచారం ఉంటే డయల్ 100లేదా సైబరాబాద్ ఎన్‌డీపీఎస్ సెల్ వాట్సాప్ నంబర్ 9490617444కు ఫిర్యాదు చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి
- పంచాయతీల నిర్వహణకు 500 కోట్ల నిధులు మంజూరు
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, ఫిబ్రవరి 17: గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకంగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం ములుగు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నూతనంగా ఎన్నికైన ములుగు, వెంకటాపూర్, మల్లంపల్లి, గోవిందరావుపేట 4 మండలాల సర్పంచ్‌లకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమ ప్రారంభానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ తయారీ ,తడి చెత్త పొడి చెత్త నిర్వహణ స్టాల్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ములుగు, మల్లంపల్లి మండలకు చెందిన 75 మంది లబ్ధిదారులకు మంత్రి సీతక్క కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచుల పాత్ర కీలకంగా ఉంటుందని, నూతనంగా ఎన్నికైన సర్పంచులకు పంచాయతీ రాజ్ చట్టంపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని, పాలకులుగా ఉంటూ సేవకులుగా ప్రజలకు సేవ చేయాలని అన్నారు. గ్రామాలలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులకు అందరికీ ఉపయోగపడే పనులకు ఖర్చు చేయాలని అన్నారు. సుమారు 500 కోట్ల రూపాయల నిధులను గ్రామ పంచాయతీలకు అందించడం జరిగిందని తెలిపారు. సర్పంచులకు మరిన్ని అదనపు బాధ్యతలు కల్పించి బాల్యవివాహాల నిర్మూలన, గ్రామాలలోని అత్యంత పేదరిక లో ఉన్న వారిని గుర్తించడం, మహిళ సంఘాలను ప్రోత్సహించడం, అభివృద్ధి పై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. క్షణ తరగతులకు విచ్చేసిన నూతన సర్పంచులకు పంచాయతీ రాజ్ చట్టం గూర్చి, అదేవిధంగా సర్పంచుల విధులు వారి బాధ్యతలపై ఐదు రోజులపాటు స్పష్టమైన అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి జిల్లా పంచాయతీ అధికారి, ఆత్మ కమిటీ చైర్మన్ , ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దేశంలో హిందువుల జనాభా తగ్గుతోంది. హిందువుల కనీసం ముగ్గురు పిల్లల్ని కనాలి. హిందూ సమాజాన్ని ఏకం చేయాల్సిన అవసరం ఉంది. హిందువులను శక్తిమంతం చేయాలి. ఇప్పుడు ఎలాంటి ముప్పు లేదు. కానీ అప్రమత్తత అవసరం. చొరబాటుదారులను గుర్తించి పంపేయాలి. ఉపాధి కల్పించకూడదు.
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

ప్రాంతీయం

అవినీతికి తావులేకుండా సుపరిపాలన కోసం పని చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి17: అవినీతికి తావు లేకుండా సుపరిపాలన కోసం పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నూతన ట్రైనీ గ్రూప్ వన్ అధికారులకు పిలుపునిచ్చారు.మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నూతన ట్రైనీ గ్రూప్ వన్ అధికారులలో ఇంటరాక్ట్ అయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.ట్రైనీ అధికారులు శిక్షణ అనంతరం ఉద్యోగ బాధ్యతలలో అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందించాలని,పారదర్శకంగా,జవాబుదారిగా ఉద్యోగం చేసినపుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. దేశంలో గ్రామీణ వ్యవస్త చాలా పెద్దదని ,గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజల అభివృద్ధే దేశ అభివృద్ధి అన్నారు. సేవల్లో తమ చుట్టూ ఉన్న వనరులను ఉపయోగించుకోవాలన్నారు.ఉద్యోగ సేవల్లో టెక్నాలజీని కూడా ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సత్తా చాటుతాం

- అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుంది
- ప్రజల్లో కాంగ్రెస్ పై పూర్తి విశ్వాసంతో ఉన్నారు
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి17 : ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మెదక్, రామాయంపేట మున్సిపల్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న విధంగానే రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొందుతామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మెదక్, రామయంపేట మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ స్థానాలను కైవసం చేసుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో 15 స్థానాలతో కలిపి ఎమ్మెల్యే ఎక్స్ ఆఫీషి యో మద్దతుతో మెదక్ మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ లపరిచిన అభ్యర్థులపై నమ్మకం ఉంచి గెలిపించినందుకు గాను పార్టీ ఎప్పటికి రుణపడి ఉంటుందన్నారు. ఇందిరమ్మ గతంలో చేసిన పనులపై ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో కూడా 75శాతం స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ ప్రజల మనలను పొందిందన్నారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కూడా అత్యధిక మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పగలురాత్రి అనే తేడా లేకుండా కష్టపడి పని చేసిన కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

గజ్వేల్ చేరిన 'రాములోరి' కళ్యాణ 'తలంబ్రాల' తయారీ

- స్వాగతం పలికిన గజ్వేల్ ఏసీపి

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 17: భద్రాచలంలో సీతారాముల కళ్యాణంలో గోటితో ఓలిచిన వడ్లనే వాడడం ఆనవాయితీ ఈ గోటి తలంబ్రాల కార్యక్రమంలో గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థకు 4వ సారి చోటు కల్పించి 3క్వింటాల్ల వడ్లను రామకోటి రామారాజుకు పంపారు. మంగళవారం నాడు ప్రజ్ఞాపూర్ పార్తీవేశ్వర స్వామి దేవాలయంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు వడ్లకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, గ్రామాన తిరిగి లక్షల మంది భక్తులచే రామనామ స్మరణ చేయించి గోటితో వడ్లను ఓలిపించి భక్తితో కల్యానానికి అందించడం హర్షనీయం అన్నారు. 4వ సారి 3 క్వింటాళ్లు అందించాలన్న రామకోటి రామరాజు దృఢ సంకల్పం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్‌బాబు, భక్తులు తుమ్మ శ్రీను, ప్రొద్దుటూరి భాస్కర్, టెంటు నర్సింలు, నంగునూరి సత్యనారాయణ, ఉమేష్ పాల్గొన్నారు.

మెదక్ లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి17:- తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ 72వ జన్మదిన వేడుకలు మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా పార్టీ అధ్యక్షురాలు యం పద్మ దేవేందర్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేసి కెసిఆర్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరంపార్టీ శ్రేణులు ఒకరికొకరు కేకు తినిపించుకున్నారు.ఈ సందర్భంగా యం. పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం కోసం అనేక కష్టాలు నోచుకుని కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి చావు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ప్రజల కల నెరవేరించింది కెసిఆర్ అని అన్నారు. 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తెలంగాణను 29వ రాష్ట్రం నుండి నెంబర్ వన్ స్థాయికి తెచ్చిన ఘనత కేసిఆర్ దే అని పేర్కొన్నారు. మెదక్ జిల్లా తరపున బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తరపున కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించారు. రాబోయే కాలంలో తెలంగాణలో తప్పకుండా మళ్లీ ముఖ్యమంత్రిగా కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని,మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు,సెక్రటరీ. కృష్ణ గౌడ్ , బిఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ లు లలిత,స్వరూప,గంగామణి,ఉదయ్ కుమార్,జుబేర్ అహ్మద్, దీపక్,మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు కొట్టాల. విశ్వం,ఆర్కే శ్రీనివాస్,మాయ.మల్లేశం, చంద్రకళ,విజయలక్ష్మి,మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి ,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజా గౌడ్, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి నాయకులు లింగ రెడ్డి,సురేందర్ గౌడ్,సంతోష్, మోచి. కిషన్,సాదిక్,కిషన్, ఇస్మాయిల్, లక్ష్మీనారాయణ, ఇందాద్, సాయిలు, సాప.సాయిలు, ఇలియాజ్ ,నరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్, ఎంబిపూర్ మహేష్,రవి,మాజీ సర్పంచ్ లతోపాటు, మెదక్ పట్టణ, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల జాతరలో మార్మోగిన ప్రభాతభేరి

- హాజరైన సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి17: ప్రస్తుత పుణ్యక్షేత్రం ఏడుపాయల వరదలుగా మాత జాతరలో తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభాతభేరి సామాజిక రుగ్మతలపై సమరభేరి సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి, కళాకారులు తమ ఆట పాటలతో డ్రామా రూపంలో గంజాయి వాడొద్దని ,యువత డ్రగ్స్ కు బానిస కావద్దని, ప్రజలు అంగు ఆర్భాటాలకు పోయి లక్షల ఖర్చు పెట్టుకుని అప్పుల పాలు కావద్దని, యువత తల్లిదండ్రుల పట్ల ప్రేమ ఆప్యాయలతో మెలగాలని అనే సందేశాలను ఇస్తూ ఆలోచనత్మకంగా సందేశాలను ఇస్తూ సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న మాట్లాడుతూ టూరిజం మరియు సాంస్కృతిక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు ఎంతో ఆలోచనతో సామాజిక రుగ్మతలను రూపుమాపాలనటువంటి సామాజిక బాధ్యతతో ఈ యొక్క ప్రభాతభేరి కార్యక్రమాన్ని చేపట్టారని జనవరి నెలలో మేడారంలో జరిగిన సమ్మక్క సారక్క జాతరలో సుమారు 150 మంది కళాకారులతో నాలుగు రోజులపాటు వివిధ రకాల సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించామని అదేవిధంగా ఏడుపాయల్లో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి తోడ్పడునందించిన భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహా రెడ్డి ఏడుపాయల ఏవో వీరేశం పాల్గొన్న కళాకారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాకారులు చేసిన కార్యక్రమాలు భక్తుల్ని ఎంతగానో ఆలోచింపజేశాయి అలరించాయి

పట్టణాభివృద్ధికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు
- మెదక్ నూతన మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్ కు అభినందన

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి17 : మెదక్ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్రనాయకులు మైనంపల్లి హన్మంతరావు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్ కు సూచించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి శాలువా, పూల మాలలవేసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ.. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేసి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కొత్త పాలకవర్గానికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. తమ గెలుపులో హన్మంతరావు మార్గదర్శకం ఉందని, ఇందుకు చైర్మన్ దంపతులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి అధికారి విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలి

- ఎస్సీ ఎస్టీ కమిటీ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం, మిడిదొడ్డి, ఫిబ్రవరి 17: సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన పేద ప్రజలను ఆదరించి, వారి సమస్యలు పరిష్కరించిన అధికారులను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ప్రతి అధికారి విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామ సందర్శనలో భాగంగా గ్రూప్ 1 అధికారులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి వచ్చిన అధికారులతో పాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు గ్రామ సర్పంచ్ ప్రమీల దేవి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, నూతనంగా నియామకమైన గ్రూప్1 అధికారులు నిబద్ధతతో విధులు నిర్వర్తించి, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామీణ పేద ప్రజల సమస్యలను తెలుసుకోవడం కోసం ఆరుగురు గ్రూప్1 అధికారులు అల్వాల గ్రామానికి రావడం అదృష్టం అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు రాష్ట్రంలో అధికారులుగా నియామకం చేపట్టిన తర్వాత పేదవారికి సహాయపడేలా విధులు నిర్వర్తించాలని కోరారు. అనంతరం గ్రూప్1 అధికారులు మాట్లాడుతూ, గ్రామంలోని ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. గ్రామస్తులు తమపై అభిమానంతో డప్పు, చప్పులతో స్వాగతం పలికిన తీరును వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజాన్ని జాగృతపరిచేవి కళలు

- జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు.
- కవులకు కళాకారులకు మెట్టినిల్లు మెదక్ జిల్లా
- తెలంగాణ సంస్కృతిక సారధి ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు భక్తులను అలరించిన సంస్కృతిక కార్యక్రమాలు
- డీపీఆర్ ఓ రామచంద్ర రాజు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి17 : ఏడుపాయల వన దుర్గ అమ్మ వారిజాతర వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మూడు రోజులు పాటు ఆహూతులను అలరించాయి. జాతర ఉత్సవాలు ఎంతో వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో కొనసాగాయి. జాతర సందర్భంగా నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక కళాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, జానపద గీతాలు, కొలాటం వంటి సంప్రదాయ కళారూపాలు ప్రేక్షకుల మదిని ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా యువతుల బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అందరినీ ఆకర్షించింది. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ప్రశంసలు అందుకున్నాయి. జాతర ప్రాంగణంలో భక్తులతో కిటకిటలాడుతూ ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. నిర్వాహకులు కళాకారులకు సన్మానాలు నిర్వహించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు మాట్లాడుతూ. నేటి సమాజాన్ని జాగ్రత్తపరిచేవి కలలని కౌవులు కళాకారులకు మెట్టినిల్లు మెదక్ జిల్లా అని ఇలాంటి కార్యక్రమాలు భక్తి, సంస్కృతిని పరిరక్షించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేసే శక్తి కళలకు ఉందని అన్నారు.మంచి నైపుణ్యం గల ,కళాకారులు జిల్లాలో అనేక మంది ఉన్నారని, వారు చేసే సాంస్కృతి సాంప్రదాయాలు నేటి తరానికి కనువిందు చేస్తాయని చెప్పారు తెలంగాణ రాష్ట్రంలో కళాకారులకు ప్రభుత్వం విశేష ఆదరణ కలిగిస్తుందని అన్నారు. జాతర ఉత్సవాలు భక్తి, సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయని తెలిపారు. జిల్లా పాలనయంత్రణంగా తరపున భద్రతా చర్యలు, తాగునీటి సదుపాయం, పారిశుధ్య ఏర్పాట్లు సమర్థంగా చేపట్టినట్లు భక్తుల నుండి ప్రశంసలు అందుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏడుపాయల్లో బందోబస్తును పరిశీలించిన అదనపు ఎస్పీ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి17: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత జాతర మూడవ రోజు కొనసాగుతున్న సందర్భంగా పోలీస్ బందోబస్తును మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరిశీలించారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన చర్యలను ఆయన పరిశీలించారు. జాతర పూర్తయ్యే వరకు భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా సమన్వయంతో పని చేయాలని అదనపు ఎస్పీ స్పష్టం చేశారు.

స్వరాష్ట్ర కలను సాకారం చేసిన 'సారు' సల్లగుండాలె

- తెలంగాణ అస్తిత్వ శిఖరం కేసీఆర్
- ఎమ్మెల్సీ వంటేరు, ఇంచార్జ్ ప్రతాపరెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 17: నిండు ఆయురారోగ్యాలతో పాటు మరింత ప్రజా సేవలో తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ముందుకు వెళ్లేలా ఆశీర్వధించాల ఆయన 72 వ జన్మదినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు మెదక్ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు స్థానిక నల్లవాగు కేసరి హనుమాన్ దేవాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బెండే మధు మరియు బీఆర్ఎస్ శ్రేణులంతా కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి కేసీఆర్ మరింత ప్రజా సేవలో ముందుకు వెళ్లేలా ఆశీర్వధించాలని ప్రార్థించారు. తదనంతరం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవి, వైస్ ఛైర్మన్ కల్యాణ్ కార్ పద్మ భాయ్ నర్సింగరావు మరియు పాలక వర్గం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం గజ్వేల్ మండలం బంగ్లా వెంకటపూర్ గ్రామ చెందిన సల్లూరీ మహేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సందర్భంగా హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు 72 వేల రూపాయల ఆర్థిక సహాయం ఇంటికి వెళ్లి అందజేశారు. తర్వాత స్థానిక ఇందిరా పార్క్ చౌరస్తాలో గజ్వేల్ మున్సిపల్ పాలక వర్గం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, మాజీ సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి,అరుణ, జఖి ఉద్దీన్, చంద్రమోహన్ రెడ్డి, కౌన్సిలర్లు, కప్ప మమత, గోలి మమత, మురళి, బొగ్గుల స్వప్న, బాపురావు, భవాని, భాగ్యలక్ష్మీ, శ్రీధర్, అత్తెల్లి శ్రీను, ఆయా గ్రామాల సర్పంచ్ లు, రమేష్, నాగలక్ష్మి, శ్రీనివాస్, నాగరాజు, జ్యోతి స్వామి, బ్యాగారి ప్రభాకర్, నాయకులు బాలమణి, మద్ది రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, రగుపతి రెడ్డి, రమేష్ గౌడ్, శివ,స్వామి, మల్లేశం, బిమప్ప, అహ్మద్,దశరథ, బాపిరెడ్డి, ఉమర్, కనక గౌడ్, భాను, చందు, బూరన్, శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఏఐ వల్ల ఉద్యోగాలు పోవు, మార్పులకు అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవడమే మార్గం. ఈ ఆధునిక సాంకేతికత మనుషులను తొలగించబోదు. సామర్థ్యాన్ని మాత్రమే పెంచుతుంది. టెక్నాలజీ మారినప్పడల్లా కొత్తరకం ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. అందుకే ప్రభుత్వం రీ-స్కిల్లింగ్‌పై భారీగా పెట్టుబడి పెడుతోంది.
- ప్రధాని నరేంద్ర మోదీ

ప్రాంతీయం

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన మహానేత కేసీఆర్

- సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి
- ఘనంగా సిద్దిపేట పట్టణంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 17: తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన మహానేత కేసీఆర్ అని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించారు. అదే విధంగా చర్చ్, మజీద్లలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఇతే హాత్ ఫౌండేషన్, రావిచెట్టు హనుమాన్ దేవాలయ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా క్యాంప్ కార్యాలయంలో రక్త దాన శిబిరం నిర్వహించి, సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో కెసిఆర్ కప్ లో భాగంగా జర్నలిస్ట్ ల మ్యాచ్ లు ప్రారంభం చేసి జర్నలిస్ట్ లతో కలసి కేక్ కట్ చేశారు. తెలంగాణ పదం లేని సమయంలో జై తెలంగాణ అని నినదించి, స్వరాష్ట్రాన్ని సాధించి సగర్వాంగ చేసుకున్నాం. తెలంగాణ తేవడమా.. నేను చావడమ అనే నినాదం ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ మహా నాయకుడు కెసిఆర్ అని, తెచ్చుకున్న తెలంగాణ ను కాళేశ్వరం అనే సాగు నీటి కలను.. త్రాగు నీటి గోసను సంక్షేమంలో దేశానికి మార్గం చూపిన గొప్ప నేతగా తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శం గా నిలిపారని చెప్పారు.ఈ కార్యక్రమం మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు,పార్టీ సీనియర్ నాయకులు,మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ మచ్చ వేణు గోపాల్ రెడ్డి,తిరుమల్ రెడ్డి, అరవింద్ రెడ్డి,గుండు భూపేష్,మోహన్ లాల్,మేర సత్యనారాయణ,ఇర్షాద్ హుస్సేన్,రెడ్డి ప్రభాకర్ రెడ్డి,రెబెల్ రమేష్, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

ప్రతిపక్షం, గుండాల, ఫిబ్రవరి 17 : గుండాల మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు 19901994 (1వ తరగతి నుంచి 5వ తరగతి) మరియు 19981999 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం సౌండ్ సిస్టం అందజేశారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తవిడిశెట్టి రాంబాబు, వాంకుడోత్ భీకోజి, ఈసం రాజశేఖర్, వాగబోయిన కౌసల్య, జవ్వాజి అరుణ, బి. కౌసల్య, కోర్స ఆదినారాయణ, పి. కాంతారావు, ఊకే వెంకటేశ్వర్లు, నునావత్ నరసింహ రావు పాల్గొన్నారు. అలాగే పాఠశాల హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, వెన్నెల, ప్రమీల, శరత్ బాబు, గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా హెచ్ఎం రమేష్ మాట్లాడుతూ.. పాఠశాలకు సౌండ్ సిస్టం అందించడం ఎంతో సంతోషకరమని, భవిష్యత్తులో కూడా పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు.సౌండ్ సిస్టం అందజేసిన 19981999 ఎస్ఎస్సీ బ్యాచ్ సభ్యులకు హెచ్ఎం పేరుపేరునా అభినందనలు తెలియజేశారు.

కోర్టు ధిక్కరణ కేసులో కలెక్టర్ కు జైలు శిక్ష

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి17: కోర్టు ధిక్కరణ కేసులో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు జైలుశిక్ష పడింది. ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయనకు హైకోర్టు ఆరు నెలల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. అనంతరం తీర్పు అమలును నాలుగు వారాలపాటు నిలిపివేసింది. అప్పీలు చేసుకునేందుకు కలెక్టర్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చింది. మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల గ్రామంలో ఓ భూమికి సంబంధించిన కేసులో కలెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని ఆరోపిస్తూ మెదక్ జిల్లా బోనల గ్రామానికి చెందిన లక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది

ఏడుపాయల్లో కనుల పండువగా రథోత్సవం

- అపూర్వ ఘట్టాన్ని తిలకించిన లక్షలాది భక్తజనం

ప్రతిపక్షం,మెదక్ టౌన్, ఫిబ్రవరి17: దుర్గమ్మ నామస్మరణతో ఏడుపాయల అటవీ ప్రాంతం మార్మోగింది. ఏడుపాయల జాతరలో చివరి రోజు అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రథం గోలి సమీపంలో రథాన్ని రంగురంగుల కాగితాలు,మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో అలంకరించారు. జాతరలో చివరి కార్యక్రమమైన రథోత్సవాన్ని తిలకించడానికి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. వందలాది మంది భక్తులు రథాన్ని లాగుతూ తన్మయత్వం పొందారు. జాతరలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగే ఈ కార్యక్రమం రాత్రి 10:00 గంటలకు ప్రారంభమైంది.

కొనసాగిన ఎదుర్కోలు ఆచారం...

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఏడుపాయల ఆలయ ఈవో వీరేశం ఎండోమెంట్ కార్యాలయం నుంచి డప్పు సప్పుళ్లతో రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్నారు. రెవెన్యూ అధికారులను ఆలయ మర్యాదలతో ఎదుర్కొని, అక్కడి నుంచి నేరుగా నాగ్సాన్‌పల్లి చేరుకొన్నారు. ఆనవాయితీ ప్రకారం గ్రామ పెద్దకాపు అయిన సాయిరెడ్డిని బాజా భజంత్రీలు, డప్పు చప్పుళ్ల మధ్య, దుర్గమ్మ ఆలయం వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి వనదుర్గాభవానీ మాత ఉత్సవ విగ్రహాన్ని ఎదుర్కొని రథం గోలి వరకు తీసుకొచ్చారు.రథం గోలి సమీపంలో రథం ముందు పట్టు పరిచి అన్నం వంచి రాసిపోసే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో 18 కులాలకు చెందిన పనిపాటల వాళ్లు పాల్గొన్నారు. అనంతరం జయజయధ్వానాలు చేస్తూ రథాన్ని లాగే కార్యక్రమం రథం గోలి ప్రాంతం నుంచి ప్రారంభించారు. ఇది నేరుగా రాజగోపురం వరకు కొనసాగింది. వేలాది మంది రథాన్ని ఊరేగించారు. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించడానికి ఏడుపాయలలో మూడు రోజుల తిష్ట వేసిన భక్తులు చెట్లు, గుట్టలు, బండరాళ్లపై ఎక్కుతూ పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెదక్ జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాస రావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున గతంలో ఎన్నడూ లేని విధంగా 1000 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ ఎస్పీ అధికారులను అప్రమత్తం చేశారు.

కేసీఆర్ కుటుంబానికి సిట్ నోటీసులు, రేవంత్ పతనానికి పరాకాష్ట

- గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ 'వంటేరు'

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 17: డైవర్షన్ పాలిటిక్స్ తో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కప్పిపుచ్చేందుకు కేసిఆర్ కుటుంబంపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రం అనేది లేకుండా ఉంటే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కుర్చీలో ఉండేవారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో తమ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రజలను డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, ప్రజలు ఎమ్మెల్యేలపై మంత్రులపై ముఖ్యమంత్రిపై ఎక్కడ తిరగబడతారో అనే సందిగ్ధంలో ఉంటూ మున్సిపల్ ఎన్నికలలో డైవర్షన్ రాజకీయాలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని కెసిఆర్, హరీష్ రావు, కేటీఆర్, సంతోష్ లకు సిట్ విచారణల పేరిట నోటీసులు ఇవ్వడం చాలా దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రంగాల ప్రజలు నష్టపోయారని నష్టపోతున్నారని వ్యాపారాలు దివాలా తీశాయని గ్రామాలలో అభివృద్ధి సంక్షేమం కుంటుపడిందని పట్టణాలలో పారిశుధ్యం లోపించిందని తెలిపారు. రేవంత్ రెడ్డి విధానాల వలన యూరియా దొరకక, విత్తనాలు దొరకక, 24 గంటల కరెంటు రాక, గిట్టుబాట్లు ధరలు లేక, రైతు బంధు రాక, రైతు బీమా లేక, పూర్తిస్థాయిలో రుణమాఫీ కాక రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రికి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సంక్షేమంపై శ్రద్ధ లేక పైశాచిక ఆనందం కోసం మతిభ్రమించిన మనిషిలాగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కానీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీపై గులాబీ జెండా రెపరెపలు తెలంగాణ రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్ వెంటే ఉన్నారన్నదానికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కళ్ళు తెరిచి ఫోన్ టాపింగ్ అనేది కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధీనంలో ఉంటుందని అది రాష్ట్ర ముఖ్యమంత్రికి మంత్రులకు సంబంధం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి రామచంద్రం నాయకులు దేవి రవీందర్, ఊడెం కృష్ణారెడ్డి, మద్దిరాజిరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, కిషన్ రెడ్డి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యాంశాలను ఇన్నోవేటివ్ గా బోధించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 17: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకొని, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఆరు మరియు పదో తరగతుల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన విధానంపై అభిప్రాయాలు అడిగారు. 'లెట్స్ ఎన్ రిచ్ ఇంగ్లీష్' పాఠ్యాంశ బోధనను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ఆంగ్ల ప్రావీణ్యంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలు విద్యార్థులకు స్పష్టంగా అర్థమవుతున్నాయా అనే విషయాన్ని తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో కూడా అన్ని తరగతులను పరిశీలించిన కలెక్టర్, ఐదో తరగతి విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడించి వారి పఠన నైపుణ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా డీఈవో ఎల్. వి.గిరి రాజ్ గౌడ్, తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో గుండె బాబు, ఎంఈఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమకొండలో ఉద్రిక్తత.. మధుసూదనాచారి హౌస్ అరెస్ట్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 17: హనుమకొండలోని టీవీ టవర్ కాలనీ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ స్పీకర్ మధుసూదనాచారిని పోలీసులు ఆయన నివాసంలోనే గృహ నిర్బంధం చేశారు. ఆయన తొర్రూరుకు బయలుదేరేందుక సిద్ధమవుతుండగా బయటకు వెళ్లకుండా, పోలీసులు ఇంటి చుట్టూ భారీగా మోహరించి అడ్డుకున్నారు. అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మధుసూదనాచారి తెలిపారు.

జనగామ మున్సిపల్ కాంగ్రెస్ కైవసం

ప్రతిపక్షం, కొమురవెల్లి, ఫిబ్రవరి 17: జనగాం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం కొమురవెల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనగామ మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీకి రావడంతో బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన అందిస్తూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నదానికి మద్దతుగా ప్రజలు ఉన్నారనేదానికి ఈ తీర్పు నిదర్శనమని అన్నారు. ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికలలో ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రజా పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి గ్రామీణ, పట్టణ ఓటర్లు అందరూ మద్దతు ఉందని నిరూపించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం వినూతన పథకాలు చేపట్టి ముందుకు కొనసాగుతుందని, కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన ప్రతి ఒక్క ఓటరుకు కాంగ్రెస్ పార్టీ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు లింగంపల్లి కనకరాజు, టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండా మహేష్, కొమురవెల్లి దేవస్థానం ధర్మకర్తలు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, చేర్యాల ఆత్మ కమిటి సభ్యులు చింతల పర్షా రాములు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్పుల రాజు, ఐనాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు రమణా రెడ్డి, మండల సెక్రటరీ స్వాములపల్లి రమేష్, మండల యూత్ సెక్రెటరీలు ఉప్పల వంశీ, యేనిశెట్టి కిరణ్, నాయకులు జనగాం శ్రీకాంత్, సానాది నాగరాజు, జొర్రిగల మల్లారెడ్డి పాల్గొన్నారు.

శ్రీమల్లికార్జునస్వామికి షేడెం కర్ణాటక మఠాధిపరులు పూజలు

ప్రతిపక్షం, కొమురవెల్లి, ఫిబ్రవరి 17: కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామికి ష'బ'108 గురు శ్రీమత్ రంబాపురి శాఖామటాదిశ్వరులు శ్రీశ్రీశ్రీ శంకర శివాచార్య మహాస్వామీజీ (షేడెం కర్ణాటక మఠాధిపరులు) స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ మత అభివృద్ధికి ప్రధాన పాత్ర పోషించాలని, ప్రతి ఒక హిందూ ధర్మాన్ని కాపాడాలని ప్రతి ఒక హిందూ ఇంట్లో భగవద్గీత తప్పకుండా ఉండాలని అన్నారు. హిందువులందరూ ఐక్యతగా ఉండి మన భారత దేశాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈదేవాలయాన్ని సందర్శించడం చాలా సంతోషదాయకమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న దేవాలయాలన్నీ అభివృద్ధి చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ దేవాదాయశాఖలో ఉన్న సనాతన సాంప్రదాయాన్ని సనాతన ఆగమ శాస్త్రాలు పాటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ దేవాదాయశాఖ మంత్రి దేవాలయాలను పూర్వ సాంప్రదాయాన్ని కాపాడే బాధ్యత తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఉపప్రధాన అర్చకులు మహాదేవుని సాంబయ్య, పడిగన్నగారి ఆంజనేయులు, సూర్య కుమార్ శివప్రసాద్, రేవన సిద్దేశ్వర్, వీరశైవ లింగాయత్ సమాజం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మహాదేవన్ శ్రీనివాస్, జిల్లా నాయకులు అనుముల మల్లేశం స్వామీజీ పాల్గొన్నారు.

భారత్‌లో ఏఐ, డేటా రంగాల్లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. ఈ రెడు రంగాలు రెండేళ్లలో 200 బిలియన్ల డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తాయి. క్లౌడ్ సేవలను అందించే కంపెనీలకు 21 ఏళ్ల పన్ను మినహాయింపు ఇస్తున్నాం. ఢిల్లీలో నిర్వహిస్తోన్న ఏఐ సమ్మిట్ కంపెనీల ప్రతిభను ప్రపంచానికి చూపడానికి ఓ గొప్ప అవకాశం. దేశం ఐటీలోనూ సత్తా చాటుతోంది.

- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రాంతీయం

మైనార్టీల అభ్యున్నతికి పెద్ద పీట

- **రంజాన్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 17 : రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకొని షకీల్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ను మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులపాటు కఠినంగా ఉపవాస దీక్షలు చేస్తూ అల్లాను ప్రార్థిస్తూ నిర్వహించే పవిత్ర మాసం రంజాన్ మాసం అన్నారు. నియోజకవర్గంలోని మైనార్టీల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. సొంత నిధులతో నూతన మసీదులు, ఈద్గాలు, ఆశిర్ఖానాలు నిర్మించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన అమీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన రంజాన్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మత పెద్దలు లియాకత్ అలీ, యూనుస్, అక్రమ్, షాబొద్దీన్, మునీర్, అతీక్, పృథ్వి, ఖాదర్, ఉమర్, అమేర్, కరీం, తదితరులు పాల్గొన్నారు.

ఐదు విజయాలు కేసీఆర్‌కు పుట్టినరోజు కానుక

- **ముందే చెప్పాం.. అమలు చేశాం.. సాధించాం**
- **మీ వెనుక నేనున్న - అభివృద్ధిలో ముందుకు సాగండి**
- **ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసి మెప్పు పొందండి**
- **నూతన మున్సిపల్ పాలకవర్గాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అభినందన సందేశం**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 17: పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో గులాబీ జెండా ఎగరవేసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి పుట్టినరోజు కానుకగా అందించామని, ఇది తన జీవితంలో మర్చిపోలేని రోజు అని ఇందుకు సహకరించిన కార్యకర్తలకు సంపూర్ణ నమ్మకంతో ఆశీర్వదించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్ హాలులో ఇటీవల నూతనంగా ఎన్నికైన గడ్డపోతారం, జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పాలకవర్గం సభ్యులు స్థానిక ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు ఓటములు అత్యంత సహజమని ప్రజలు నమ్మకంతో గెలిపించిన ప్రజాప్రతినిధులందరూ ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధి సంక్షేమాల అంశంలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఇందుకు తాను ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఐదు మున్సిపాలిటీల అభివృద్ధికి 15 కోట్ల రూపాయలు చొప్పున నిధులు సిద్ధంగా ఉన్నాయని.. అతి త్వరలో ఇందుకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు చేద్దామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికిని రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంపై పటాన్ చెరు ప్రజలు ఎల్లప్పుడూ తమ నమ్మకాన్ని కొనసాగిస్తున్నారని.. ఇందులో భాగంగా ఐదు మున్సిపాలిటీలలోనూ బిఆర్ఎస్ పార్టీని నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించారని అన్నారు. రాబోయే ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలతో పాటు కార్పొరేషన్ ఎన్నికల్లోను క్లీన్ స్వీప్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ పీఠం బీఆర్ఎస్ ఖాతాలోకి

- **ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ గా ప్రమీల, వైస్ చైర్మన్ గా పట్లోళ్ల హరీష్ రెడ్డి**

ప్రతిపక్షం, సంగారెడ్డి, ప్రతినిధి, ఫిబ్రవరి 17 : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం,ఇంద్రేశం మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మంగళవారం సుజావుగా నిర్వహించబడ్డాయి. అవసరమైన కోరం లేక సోమవారం వాయిదా పడిన ఎన్నికలు మంగళవారం పూర్తి కావడంతో చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ దక్కించుకుంది. సోమవారం ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేయగా, మంగళవారం మరో 12 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం హాజరైన సభ్యుల్లో 10 మంది బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు ఉన్నారు.చైర్మన్‌గా 8వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ప్రమీల ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా 12వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల హరీష్ రెడ్డి ఎన్నికయ్యారు. పఠాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి విచ్చేసి చైర్మన్ కు వైస్ చైర్మన్ కు కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువలతో సన్మానం చేశారు,

బీజేపీలో చేరిన బేరా సత్యనారాయణ

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 17: మాజీ ఎంపీపీ బేరా సత్యనారాయణ మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు ఆధ్వర్యంలో బీజేపీ చేరాడు ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కండువా గప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సత్యనారాయణతో పాటు ఆయన కూతురు కూడా పార్టీలో చేరారు. మాజీ కౌన్సిలర్ బేరా సత్యనారాయణ బీజేపీ చేరడంతో సింగరేణి ఏరియాలో పార్టీకి పట్టు సాధించినట్లు అయింది. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి రఘునాథరావు, రవీందర్రావు, పాల్గొన్నారు. సత్యనారాయణ తో పాటు పదిమంది కార్యకర్తలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ లో గీతం విద్యార్థికి కాంస్య పతకాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 17 : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో చివరి ఏడాది బీ.టెక్. (సీఎస్ఈ) విద్యార్థి ఎస్.వీరంధ్ర ఫిబ్రవరి 4 నుంచి 8వ తేదీ వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అరీనాలో నిర్వహించిన ఐదవ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ కప్2026 పోటీలలో రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో దాదాపు పది దేశాలకు చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు. సీనియర్ కేటగిరీలో పోటీపడిన వీరంధ్ర అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ఆయనతో పాటు తెలంగాణ బృందంలోని ఇతర సభ్యులు కూడా ప్రతిభ కనబరచి కిక్ లైట్, లైట్ కాంటాక్ట్, జూనియర్ విభాగాలలో బంగారు, వెండి పతకాలను గెలుచుకున్నారు. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. నారాయణరావు చౌదరి తదితరులు వీరంధ్ర సాధించిన విజయానికి అభినందనలు తెలియజేశారు. ఆయన అంకితభావాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణించడానికి కృషి చేయమని ప్రోత్సహించారు.

కర్పూర్ ఠాగూర్ స్పూర్తితో బీసీలు ఉద్యమించాలి

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 17 : బీహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీసీ బిడ్డ కర్పూర్ ఠాగూర్ స్పూర్తితో బీసీలు ఉద్యమించాలని బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో కర్పూర్ 38వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మంచిర్యాలలో ఏర్పాటుచేసిన సభలో పలువురు మాట్లాడారు. బీసీ సామాజిక న్యాయ ఆకాంక్షలను దేశ రాజకీయ ఎజెండా దేశమంతటా తీసుకువచ్చిన బీసీ నాయకుడని కొనియాడారు. 1970లో రెండుసార్లు బీహార్ ముఖ్యమంత్రిగా సేవలను అందించిన కర్పూర్ ఠాగూర్ అట్టడుగు వర్గంలో పుట్టి అత్యున్నత స్థానానికి ఎదిగిన బీసీ నాయకుడిగా నిలిచారన్నారు. బీసీలకు రిజర్వేషన్ వాటా చట్టసభల్లో కల్పించాలని కోరిన వ్యక్తి అని అన్నారు. ఆయన చూపిన ఆశయాలను నేటి బీసీలు కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కనుకుట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ మేధావుల పురం జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరామోజీ కొండయ్య, బహుజన ఐక్యవేదిక నాయకులు కామిల్ల జయ రావు కైలాసం, రమేష్ రావు పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 17 : జక్రాన్ పల్లి మండలం పడకల్ గ్రామంలో సీసీఎస్ పోలీసులు 10 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ ను పట్టుకున్నారు. పడకల్ గ్రామంలో మాక్లూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ మోయిన్ ఖాన్ పిడిఎస్ రైస్ నిల్వ చేసినట్లు పోలీసులకు విశ్వాసనియమైన సమాచారం అందింది. దాంతోసీసీఎస్ ఎస్సై గోవింద్, కానిస్టేబుల్ రవి, అనిల్ ఆధ్వర్యంలో పడకల్ గ్రామంలో ఓ రేకుల షెడ్డులో దాచి ఉంచిన పిడిఎస్ రైస్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బీసీ కార్పొరేటర్ పెట్టాం స్వరూపకు ఘన సన్మానం

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి17: మంచిర్యాల కార్పొరేషన్ ఎన్నికలలో గెలుపొందిన 50 డివిజన్ అభ్యర్థి పెట్టం స్వరూపను మంగళవారం జాతీయ బీసీ పోరాట సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల పోరాటం వలన రాజకీయ ప్రధాన పార్టీలు బీసీ అభ్యర్థులకు బీఫాములు ఇవ్వడం జరిగిందన్నారు. బీసీ సంఘాల పోరాట ఫలితంగానే మంచిర్యాల కార్పొరేషన్ లో బీసీ అభ్యర్థులు గెలుపొందడం జరిగిందన్నారు. రాబోయే కాలంలో కార్పొరేషన్ లో గెలుపొందిన బీసీ కార్పొరేటర్లు బిసి రిజర్వేషన్ల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే విషయంలో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్మల శ్రీనివాస్, బీసీ సంఘం సీనియర్ నాయకులు గజల్ వెంకటయ్య, భీమ్సేన్, వేముల అశోక్, చారి లతోపాటు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 17: బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం లో మంగళ వారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆధ్వర్యం లో రూరల్ మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం కేసీఆర్, బాజిరెడ్డి గోవర్ధన్ ల పుట్టిన రోజు ఒకే రోజు కావటంతో వారికి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన 37వ డివిజన్ కార్పొరేటర్ ప్యాట విజయ లక్ష్మి, 37వ డివిజన్ అధ్యక్షుడు ప్యాట సంతోష్ లను పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దాదాన్న గారి విఠల్ రావు, పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, సత్య ప్రకాశ్, సుజిత్ సింగ్, దండు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేటలో ఆధిపత్య వర్గాల మార్క్ రాజకీయం

- **రెండు మున్సిపాలిటీలలో ఎస్సీ,ఎస్టీ వర్గాలకు దక్కని పుర పీఠం**
- **బహుజనుల సొంత పార్టీ బీఎస్పీని బలపరిస్తేనే బహుజన వర్గాలకు న్యాయం!**
- **బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్**

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 17 : ఎస్సీ ,ఎస్టీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకు కోసం బీజేపీ,కాంగ్రెస్ పార్టీలు వాడుకుంటున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ ఆరోపించారు.మంగళవారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణ పేట జిల్లా లోని మక్తల్,నారాయణ పేట మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ పదవుల్లో ఎస్సీ,ఎస్టీ వర్గాలకు ఏ ఒక్కటి దక్కకపోవడం అంటే పేట జిల్లాలో ఆధిపత్య బీజేపీ,కాంగ్రెస్ పార్టీల మార్క్ రాజకీయాలకు నిదర్శనమన్నారు.మున్సిపాలిటీ లుగా ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ఎస్సీ,ఎస్టీ వర్గాలకు ఒక్కసారి కూడా రిజర్వ్ కాలేదని,సామాజిక న్యాయం అంటూ నిత్యం ప్రజల్ని మభ్య పెడుతున్న బీజేపీ,కాంగ్రెస్ పార్టీలకు ఇది కనబడటం లేదా అంటూ ప్రశ్నించారు. మహబూబ్ నగర్ పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆధిపత్య కుల రాజకీయాల గురించి మాట్లాడే ఎంపీ డీకే అరుణకు ఎస్సీ ఎస్టీ వర్గాల నాయకులు గుర్తు లేరా? అని విమర్శించారు. బహుజనులకు న్యాయం జరగాలంటే బహుజనుల సొంత పార్టీ బీఎస్పీ ని బలపరచాలన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అంకిత భావంతో కృషి చేయాలి

- **మహిళా సర్పంచుల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 17 : పల్లెల సర్వతోముఖాభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తూ, మహిళా శక్తి సామర్థ్యాలను చాటాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన మహిళా సర్పంచులకు జిల్లా కేంద్రంలోని న్యాక్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా సర్పంచుల అధికారాలు, విధులు, బాధ్యతల గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. ఐదు రోజుల పాటు కొనసాగే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని రంగాలలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలనే సదుద్దేశ్యంతో స్థానిక సంస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని మహిళా సర్పంచులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని, గ్రామాలలో సమర్ధవంతమైన పాలనను అందిస్తూ రిజర్వేషన్లకు సార్థకత చేకూర్చాలని హితవు పలికారు. గ్రామ పాలనలో కుటుంబ సభ్యుల జోక్యానికి అవకాశం ఇవ్వకుండా, గ్రామ ప్రథమ పౌరులుగా గౌరవాన్ని పెంపొందించుకోవాలని, ఇది భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులకు ఆస్కారం కల్పిస్తుందని అన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అందరి సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత సర్పంచులపై ఉందని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, కస్తుర్బా గాంధి విద్యాలయాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, అంగన్వాడి కేంద్రాలు వంటి వాటిని సందర్శిస్తూ, ఏవైనా లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి వాటిని సవరించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల ప్రగతి కోసం సర్పంచ్ లకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. బాల్య వివాహాలు వంటి దురాచారాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు.ప్రజలతో మమేకమై పారదర్శకంగా పాలన సాగించాలని, గ్రామంలో నెలకొని ఉన్న పరిస్థితులపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకుంటే సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందని సూచించారు. పన్నులు, ఇతర స్థానిక వనరుల ద్వారా సమకూరే ఆదాయ వనరులపై దృష్టిని కేంద్రీకరించాలని, ఆదాయం సమకూరితే ప్రజోపయోగ పనులను చేపట్టి మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, వినూత్న ఆలోచనలతో పల్లెల ప్రగతికి పాటుపడుతూ మంచి గుర్తింపు పొందాలని సూచించారు. సమర్ధవంతంగా విధులు నిర్వర్తించిన 10 మంది సర్పంచులను ఉత్తమ సర్పంచులుగా ఎంపిక చేసి సన్మానిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గంగాదేవిపల్లి సందర్శనకు అధ్యయన యాత్ర కోసం పంపిస్తామని అన్నారు. శిక్షణా తరగతులలో చెప్పే ప్రతి అంశాన్ని చక్కగా ఆకళింపు చేసుకుని, గ్రామాలలో సమర్ధవంతమైన పాలనను అందిస్తూ ప్రతి ఒక్కరూ ఉత్తమ సర్పంచులుగా గుర్తింపు పొందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్ రావు, ఏ.ఓ రాజాబాబు, డీ.ఎల్.పీ.ఓలు, ఆయా గ్రామాల మహిళా సర్పంచులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

జినోమ్ వ్యాలీని విస్తరిస్తూ ఫేజ్-4ను 100 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నాం. లైఫ్ సైన్సెస్ రంగంలో 2035 నాటికి 25 బిలియన్‌డాలర్ల పెట్టుబడుల లక్ష్యంగా ప్లాన్ రూపొందించాం. ట్రైడెంట్ ఏఐ కంపెనీ రూ300 కోట్లు , ఆర్ఎక్స్‌ప్రొపెల్లెంట్ రూ1000 కోట్ల పెట్టుబడి పెడుతున్నాయి. ఏఐ ఆధారిత డ్రగ్స్ డిస్కవరీలో యువతకు శిక్షణ ఇప్పిస్తాం.

- మంత్రి శ్రీధర్ బాబు

'సర్వమ్ కేజ్'.. ఏఐ టెక్నాలజీ కళ్లజోడు

- పరీక్షించిన ప్రధాని మోడీ

భారతీయ కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్ 'సర్వమ్ ఏఐ' దేశంలోనే తొలి ఏఐ టెక్నాలజీ కండ్ల జోడును విడుదల చేసింది. ఢిల్లీలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'ను ప్రారంభించిన ప్రధాని మోదీ, అత్యంత అధునాతన ఏఐ కండ్ల జోడు 'సర్వమ్ కేజ్'ను ధరించినట్టు సదరు కంపెనీ చీఫ్ ప్రత్యూశ్ కుమార్ మీడియాకు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఒక టీజర్‌ను 'ఎక్స్'లో విడుదల చేశారు. చాట్ జీపీటీ, గూగుల్ జెమినైలకు దీటుగా ఏఐ హార్డ్‌వేర్ ఉత్పత్తులను తీసుకొస్తున్నట్టు 'సర్వం ఏఐ' కంపెనీ ఇప్పటికే ప్రకటించింది. దాంట్లో భాగంగా తయారుచేసిన ఏఐ కండ్ల జోడును ఈ ఏడాది మేలో మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. గత ఏడాది మెటా కంపెనీ తీసుకొచ్చిన ఏఐ కళ్లజోడు 'మెటా రేబాన్స్' 70 లక్షలకుపైగా అమ్ముడుపోయాయి. యాపిల్ కూడా ఈ తరహా స్మార్ట్‌గ్లాసెస్‌ను తీసుకురాబోతున్నది. "సర్వం కేజ్ కళ్లజోడును మొదట టెస్ట్ చేసి చూసింది ప్రధాని మోదీయే. లైవ్‌లో అది ఎలా పనిచేస్తుందో మోదీ పరీక్షించి చూశారు. ఈ కళ్లజోడు డిజైన్, ఏఐ ఫీచర్ల నుంచి తయారీ దాకా అన్నీ మన ఇండియాలోనే జరుగుతాయి. యూజర్లు సర్వం ఏఐ ప్లాట్‌ఫామ్ ద్వారా తమ అవసరాలకు అనుగుణంగా వినియోగపరమైన మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ఈ ఏడాది మే కల్లా దీన్ని భారత మార్కెట్లోకి తీసుకొస్తాం" అని పేర్కొంటూ ఎక్స్ వేదికగా సర్వం ఏఐ కంపెనీ సహ వ్యవస్థాపకుడు ప్రత్యూష్ కుమార్ ట్వీట్ చేశారు.

విశ్వ వీక్షణం

బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ రహమాన్ ప్రమాణం

ఢాకా: బంగ్లాదేశ్ కొత్త ప్రధానిగా బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) అధినేత తారిఖ్ రహ్మాన్ మంగళవారం ప్రమాణం చేశారు. దశాబ్దాల పాటు షేక్ హసీనా, ఖలేదా జియాల ఆధిపత్యంలో బంగ్లాదేశ్ రాజకీయాలు సాగగా మొదటిసారి ఎన్నికల్లో ఓ కొత్త వ్యక్తి పోటీచేసి ప్రధానిగా ప్రమాణం చేయడం చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఖలీదా జియా కుమారుడైన తారిఖ్ రహ్మాన్ 17 ఏండ్ల ప్రవాస జీవితాన్ని ముగించుకుని గత ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగిరావడమే గాక తన తల్లి మరణానంతరం పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఎన్నికల్లో పార్టీని విజయ తీరానికి చేర్చారు. ఢాకాలోని జాతీయ సంగ్సద్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ జర్దారీ బీఎన్‌పీ చైర్మన్ రహ్మాన్ చేత ప్రమాణం చేయించారు. భారతదేశ ప్రతినిధిగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ కార్యక్రమానికి హాజరుకావడం హసీనా ప్రవాసంతో రెండు దేశాల మధ్య సంబంధాల్లో ఏర్పడిన ఉద్రిక్తతలను తగ్గే సూచనలు కనపడుతున్నాయి. అంతకుముందు బీఎన్‌పీ పార్లమెంటరీ పార్టీ పార్లమెంట్ భవనంలో సమావేశమై తమ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా రహ్మాన్‌ను ఎన్నుకుంది. తారిఖ్ రహ్మాన్ గడిచిన 35 ఏండ్లలో బంగ్లాదేశ్ తొలి పురుష ప్రధాని. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం, మైనారిటీల రక్షణలో విఫలమై స్వదేశంలో నిరంతర విమర్శలు ఎదుర్కొన్న బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనస్ తన వీడ్కోలు ప్రసంగంలో భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. ఈశాన్య రాష్ట్రాలైన సెవెన్ సిస్టర్స్‌ను మరోసారి ప్రస్తావించి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. 'విశాల సముద్రం మా దేశానికి భౌగోళిక సరిహద్దు మాత్రమే కాదు.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం కావడానికి అదో మార్గం. నేపాల్, భూటాన్, సెవెన్ సిస్టర్స్‌తో కలిసి ఈ ప్రాంతం గొప్ప ఆర్థిక సామర్థ్యం కలిగి ఉంది' అని అన్నారు.

అపశకునం ఆమెదా మన ఆలోచనలదా?

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

ఇరవై ఒకటో శతాబ్దంలో ఆర్థికంగా ఎదగడం మాత్రమే ప్రగతి అనిపించుకోదు. 5 కోట్ల మంది మహిళలు ఇప్పటికీ మూఢనమ్మకాల సంకెళ్లలో బతుకుతున్నారంటే, అది మన సమాజానికే సిగ్గుచేటు. భర్తను కోల్పోయిన మహిళలను కేవలం వితంతువుల గా చూస్తూ, వారిని శుభకార్యాలకు, సంతోషాలకు దూరం చేయడం ఏ రకమైన నాగరికత? వయసుతో సంబంధం లేకుండా ప్రతి మహిళకు ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంది. ఆ హక్కును కాలరాసే అంధవిశ్వాసాలకు ఇకనైనా ముగింపు పలకాలి మనం ఎంతో ఎదిగామని చెప్పుకుంటాం కానీ, వితంతువుల విషయంలో మన ఆలోచనలు మాత్రం ఇంకా మధ్యయుగంలోనే ఆగిపోయాయి. ఒక మహిళ భర్తను కోల్పోవడం ఆమె తప్పు కాదు, కానీ సమాజం ఆమెను ఒక అపశకునంలా చూడటం మాత్రం ముమ్మాటికీ మన తప్పే. వేడుకల్లో వారిని భాగస్వాములను చేయకపోవడం వల్ల మనం సాధించేది ఏముంది? వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం తప్ప! చరిత్ర పుటల్లో చూస్తే, వితంతువులపై అమలైన ఆంక్షల వెనుక ఉన్నది భక్తి కాదు, కేవలం ఆధిపత్యం మాత్రమే. అనాదిగా స్త్రీ స్వేచ్ఛను అణచివేయడానికి మతాన్ని, సంప్రదాయాన్ని అడ్డుపెట్టుకుని సృష్టించిన కట్టుబాట్లివి. సతీసహగమనం పోయినా, ఆ రూపంలో ఉన్న వివక్ష నేటికీ తెల్ల చీరల రూపంలోనో, శుభకార్యాల వెలివేత రూపంలోనో సజీవంగానే ఉండటం అత్యంత విచారకరం సంస్కర్తలు పోరాడారు, చట్టాలు మారాయి, హక్కులు వచ్చాయి, కానీ మనుషుల మనసులే మారలేదు! రాజారామ్మోహన్ రాయ్ వంటి వారు ఆనాడే వితంతువుల కోసం గొంతు ఎత్తినా, నేటికీ మన సమాజం వారిని రెండో శ్రేణి పౌరులుగానే చూస్తోంది. చట్టసభల్లో సమానత్వం గురించి గొప్పలు చెప్పుకుంటాం కానీ, సొంత ఇంట్లో ఒక శుభకార్యం వస్తే మాత్రం వితంతువులను గడప దాటనివ్వం. మంగళసూత్ర ధారణ, హారతులు, ఆశీర్వాదాలు, ఇలాంటి వేడుకల్లో వారిని భాగస్వాములను చేయకపోవడం అంటే వారి ఉనికిని అవమానించడమే. కొత్త వ్యాపారాలన్నా, పిల్లల నామకరణాలన్నా వారి నీడ పడకూడదనే అంధవిశ్వాసం మన అభ్యుదయ భావాలకే ఒక మాయని మచ్చ. చట్టం మనిషికి స్వేచ్ఛనిచ్చినా, సమాజం మాత్రం ఇంకా ఆచారాల సంకెళ్లతోనే వారిని కట్టిపడేస్తోంది.

ఇంకా అనాగరికంలోనే బతుకుతున్నాం..

ఒక మహిళ వితంతువు కాగానే ఆమెకు తనపై తనకే హక్కు లేని పరిస్థితి వస్తోంది. ఆహారపు అలవాట్ల దగ్గరి నుంచి అలంకరణల వరకు సమాజం గీసిన గీత దాటనివ్వడం లేదు. అశుభం అనే నెపంతో ఆమెను ఉదయాన్నే బయటకు రానివ్వకుండా, పండుగలకు దూరంగా పెడుతున్నారంటే మనం ఎంతటి అనాగరికతలో ఉన్నామో అర్థమవుతోంది. ఆస్తి హక్కులు చట్టంలో ఉన్నా, సొంత మనుషులే వాటిని కాలరాస్తూ ఆర్థికంగా ఆమెను దెబ్బతీస్తున్నారు. వితంతువుల పట్ల చూపే ఈ వివక్ష వారి మానసిక ఆరోగ్యాన్ని చిన్నాభిన్నం చేస్తోంది. తోడు కోల్పోయిన మహిళకు అండగా ఉండాల్సింది పోయి, ఆమె మీద వితంతువు అనే ముద్ర వేసి ఒక మూలకు నెట్టేయడం క్రూరత్వం కాదా? ఆమె చదువుకున్నా, గొప్ప మేధావి అయినా సరే,లోకం మాత్రం ఆమెను కేవలం విధవ గానే చూస్తుంది తప్ప ఒక మనిషిగా గుర్తించడం లేదు. ఇది మన ఆలోచనా దృక్పథంలో ఉన్న లోపం కాక మరేమిటి?

సంస్కృతి పేరుతో వివక్ష

ఒక వితంతువు ఎదుర్కొనే అసలైన సమస్య ఆర్థికం మాత్రమే కాదు. అది సామాజిక బహిష్కరణ. చుట్టూ మనుషులున్నా సరే, ఆమె ఒక ఏకాకి. స్నేహితులు దూరం, బంధువుల హేళన, సొంత వారి నిర్లక్ష్యం, ఇవన్నీ ఆమె ఆత్మగౌరవాన్ని క్రమక్రమంగా చంపేస్తాయి. మన చదువులు కేవలం ఉద్యోగాల కోసమే తప్ప, మూఢనమ్మకాలను పారద్రోలడానికి కాదని ఈ వివక్ష నిరూపిస్తోంది. సమాజం ఎంత ఆధునికంగా కనిపిస్తున్నా, లోపల మాత్రం ఇంకా పాతకాలపు పితృస్వామ్య వేర్లే బలంగా ఉన్నాయి. స్త్రీ గుర్తింపు అనేది ఆమె భర్తతోనే ముడిపడి ఉండాలనే సంకుచిత భావన పోనంత వరకు, వితంతువులకు ఈ నరకయాతన తప్పదు. చట్టాలు మారితే సరిపోదు, మనుషుల మనస్తత్వాలు మారాలి. అప్పుడే ఆమెకు ఒక వ్యక్తిగా, ఒక మనిషిగా ఈ సమాజంలో గౌరవం దక్కుతుంది. మూడవ కారణ,సంప్రదాయం పేరుతో మనం చేస్తున్న తప్పు. ఆచారాలను గౌరవించడం తప్పు కాదు, కానీ అవే ఆచారాలు తోటి మనిషిని కించపరిచేలా ఉంటే అవి సంస్కృతి ఎలా అవుతాయి? మన కుటుంబాల్లో, సంఘాల్లో ఇది మన పద్ధతి అంటూ వితంతువులపై ఆంక్షలు విధిస్తూనే ఉన్నారు. దీనిని ఎవరైనా ఎదిరిస్తే, వారికి భారతీయత తెలియదని నోళ్లు మూయిస్తున్నారు. వివక్షను సంస్కృతిగా భ్రమపడటం మన సమాజం చేస్తున్న అతిపెద్ద పొరపాటు. చట్టం తన పని తాను చేసుకుపోతుందంటారు కానీ, వితంతువుల విషయంలో అది జరగడం లేదు. అన్యాయం జరిగినప్పుడు న్యాయం కోసం పోరాడే ధైర్యం వారికి కలగనివ్వడం లేదు ఈ సమాజం. చట్టపరమైన రక్షణలు ఎన్ని ఉన్నా, సామాజిక భయం, ఆర్థిక ఇబ్బందులు వారిని ఇంటి నాలుగు గోడల మధ్యే బంధీలుగా చేస్తున్నాయి. హక్కులు కేవలం కాగితాల మీద ఉంటే సరిపోదు, అవి బాధితుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చినప్పుడే వాటికి విలువ ఉంటుంది పది మంది మనుకుంటారో' అన్న భయం వితంతువుల చుట్టూ ఒక అదృశ్య గోడను నిర్మిస్తోంది. బయటి ప్రపంచంలోకి వెళ్లాలన్నా, నలుగురితో నవ్వాలన్నా సమాజం నుంచి అనుమతి కావాల్సిన స్థితి. ఈ పరిమితులు కేవలం వారి స్వేచ్ఛను హరించడం లేదు, వారి వ్యక్తిత్వాన్ని తుడిచేస్తున్నాయి. ఇది వారు కోరుకున్న ఏకాంతం కాదు, సమాజం బలవంతంగా రుద్దిన మానసిక నిర్బంధం.

సామాజిక విలువల వైఫల్యం

సమాజం ఇచ్చే తీర్పులను నిజమని నమ్మి, ఆ మహిళలు తమని తాము ద్వేషించుకోవడం మొదలుపెడుతున్నారు. నేను అశుభురాలినా? అనే ప్రశ్నతో వారి మనసు ముక్కలవుతోంది. నువ్వు మాకు వద్దు, నువ్వు దూరంగా ఉండు అని ఈ లోకం పదే పదే గుర్తుచేస్తుంటే, వారు తమని తాము లోకానికి దూరం చేసుకుంటున్నారు. ఇది కేవలం ఒక మహిళ సమస్య కాదు, మన సామాజిక విలువల వైఫల్యం. ఈ పరిస్థితి మారాలంటే మన విద్యారంగం అక్షరాస్యతను దాటి సామాజిక అవగాహన వైపు అడుగులు వేయాలి. విద్యార్థులకు హేతువాద ఆలోచనలను అలవరచాలి. వివక్ష అనేది మానవ హక్కుల ఉల్లంఘన అని, మూఢనమ్మకాలు సమాజానికి శాపమని వారికి చిన్నప్పుడే బోధించాలి. పాఠ్యాంశాల్లో సామాజిక న్యాయం, వితంతువుల హక్కుల గురించి చర్చించాలి. చదువుకున్న ప్రతి ఒక్కరూ సమాజంలోని ఈ అంధవిశ్వాసాలను ప్రశ్నించగలిగినప్పుడే నిజమైన మార్పు మొదలవుతుంది. సమాజం మారాలంటే మొదట మన ఇళ్లు మారాలి. ఒక కొడుకు తన తల్లిని, ఒక కూతురు తన అత్తమ్మను లేదా బంధువును ఒక వితంతువులా కాకుండా, ఒక మనిషిలా చూడటం నేర్చుకోవాలి. ఏ శుభకార్యం జరిగినా వారిని దూరం పెట్టకుండా, వారితోనే ఆ కార్యక్రమాన్ని మొదలు పెట్టే ధైర్యం మనకు ఉండాలి.

అన్నింటా భాగస్వాములను చేయాలి

పూజలు, పెళ్లిళ్లు, గృహప్రవేశాలు ఇలా ప్రతి సందర్భంలోనూ వారిని గౌరవప్రదంగా ఆహ్వానించాలి. అది వారు మనపై చూపే ప్రేమకు మనం ఇచ్చే గౌరవం. వితంతువుల పట్ల సమాజం వేసే ముద్రలను చెరిపివేయాలంటే, మనం మన ఇంట్లోనే ఆ ముద్రలను తుడిచేయాలి. వారిని అణచివేయడం కాదు, వారి వ్యక్తిత్వానికి విలువిస్తూ, నిర్ణయాధికారంలో వారిని భాగస్వాములను చేయాలి. అప్పుడే మన పిల్లలు కూడా వివక్ష లేని రేపటి సమాజాన్ని నిర్మిస్తారు మనుషుల ఆలోచనలను మార్చే శక్తి కళకు, మీడియాకు ఉంది. వితంతువుల పట్ల ఉన్న అపశకునపు ముద్రలను చెరిపేయడంలో మన చిత్ర పరిశ్రమ, సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాలి. వారిని కేవలం విధవలు గా చూపిస్తూ సానుభూతిని పిండుకోవడం మానేసి, వారిని ఒక స్ఫూర్తిప్రదాతలుగా చిత్రించాలి. వారి సహనానికి, వారు అధిగమించిన సవాళ్లకు గుర్తింపునివ్వాలి. ప్రముఖ వ్యక్తులు, యూట్యూబర్లు ఇలాంటి సున్నితమైన అంశాలపై చర్చలు పెట్టాలి. ఇది తప్పు అని గట్టిగా చెప్పినప్పుడే సామాన్య ప్రజల్లో మార్పు మొదలవుతుంది. వితంతువుల జీవితాల్లోని చీకటిని కాకుండా, వారు నిర్మించుకున్న వెలుగును పదిమందికి తెలిసేలా ప్రచారం చేయాలి. ఒక వ్యవస్థగా మీడియా, ఒక సమాజంగా మనం కలిసికట్టుగా నిలబడినప్పుడే, సంప్రదాయం పేరిట జరుగుతున్న ఈ మానసిక హింసకు చరమగీతం పాడగలం.

న్యాయ సహాయం అందించాలి..

నాలుగవది, చట్టం వారికి రక్షణ కవచం కావాలి. వితంతువులపై వివక్ష చూపడాన్ని ఒక సామాజిక నేరంగా పరిగణించాలి. ఆ మహిళలకు పింఛన్లు, ఆరోగ్య బీమా వంటి సదుపాయాలు కల్పించడంతో పాటు, వారి పిల్లల చదువుకు పూర్తి భరోసా ఇవ్వాలి. ఆర్థిక స్వావలంబన లేకపోవడమే వారిని అణచివేతకు గురిచేస్తోంది. అందుకే, వారికి వృత్తి శిక్షణనిచ్చి గౌరవప్రదమైన ఉపాధి మార్గాలను చూపించాలి. ఎక్కడో దూరాన ఉన్న న్యాయస్థానాల వరకు వారు వెళ్లలేరు. అందుకే, వారి పరిసరాల్లోనే ఉచిత న్యాయ సహాయం అందాలి. కుటుంబం నుంచి కానీ, సమాజం నుంచి కానీ ఎదురయ్యే వేధింపులను అడ్డుకోవడానికి ప్రత్యేక వ్యవస్థలు పనిచేయాలి. పెన్షన్ పథకాలు కేవలం బతకడానికి మాత్రమే కాకుండా, వారు ఆత్మగౌరవంతో జీవించడానికి అవసరమైన ఆర్థిక శక్తిని ఇచ్చేలా ఉండాలి. చట్టపరమైన అండదండలు ఉన్నప్పుడు, ఏ మహిళ కూడా ఒంటరిగా ఉన్నానని కుంగిపోదు. మతం అనేది మనుషులను కలపాలి కానీ, వివక్షతో దూరం చేయకూడదు. వితంతువుల పట్ల చూపే అమానుషమైన ఆంక్షలకు మతంతో సంబంధం లేదని మత నాయకులు బాధ్యతగా ప్రకటించాలి. వేదాలనో, గ్రంథాలనో అడ్డుపెట్టుకుని చేసే తప్పుడు వ్యాఖ్యానాలకు అడ్డుకట్ట వేయాలి. ప్రార్థనా మందిరాల్లో వితంతువులను గౌరవంగా ఆహ్వానించడం ద్వారా సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని ఇవ్వొచ్చు. పీఠాధిపతులు, గురువులు, మత ప్రచారకులు తమ ఉపన్యాసాల్లో స్త్రీ హక్కుల గురించి, ముఖ్యంగా భర్తను కోల్పోయిన మహిళల పట్ల చూపాల్సిన మానవత్వం గురించి మాట్లాడాలి. మూఢనమ్మకాల ముసుగులో ఉన్న అంధవిశ్వాసాలను పారద్రోలి, మానవత్వమే అసలైన మతమని నిరూపించాలి. అప్పుడే సమాజంలో వేళ్లూనుకున్న ఈ వివక్ష వేళ్లతో సహా కదిలిపోతుంది. లోకం విధించిన పరిమితులను దాటుకుని, ఎందరో మహిళలు ఈరోజు విజయకేతనం ఎగురవేస్తున్నారు. వారు కేవలం బతకడం లేదు,ఎలా గెలవాలో ప్రపంచానికి చూపిస్తున్నారు. సంప్రదాయం పేరుతో కట్టేసిన గోడలను యువత ఇప్పుడు ధైర్యంగా కూల్చేస్తోంది. తమ ఇంట్లోని వితంతువులకు ఆత్మగౌరవాన్ని పంచుతూ, వారిని అన్ని వేడుకల్లో భాగస్వాములను చేస్తోంది. అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న మద్దతు సమూహాలు, కౌన్సెలింగ్ కేంద్రాలు వారికి కొండంత అండగా నిలుస్తున్నాయి. వివక్షపై పోరాటం అంటే కేవలం మాటలు కాదు. అది ఒక సామాజిక పరివర్తన. ఈ మార్పు తాలూకు వెలుగులు ప్రతి ఇంటికీ చేరాలి. వితంతువు అనే పదం ఒక మహిళ బలహీనత కాకూడదు, అది ఆమె పోరాటానికి, ధైర్యానికి ఒక గుర్తు కావాలి. ఆ దిశగా మనమందరం అడుగులు వేద్దాం మార్పు అనేది ఎవరో వచ్చి చేసేది కాదు అది నా దగ్గర, మీ దగ్గర మొదలవ్వాలి. భర్త లేనంత మాత్రాన ఒక మహిళను అశుభురాలిగా చూడటం మన సంస్కారం అనిపించుకోదు. రాజ్యాంగం హక్కులను ఇస్తుంది, కానీ గౌరవాన్ని ఇవ్వాల్సింది మనమే. వివాహ స్థితితో సంబంధం లేకుండా ప్రతి స్త్రీ ఆత్మగౌరవంతో బతికే వాతావరణాన్ని మనం సృష్టించాలి.

మార్పు మన నుంచే మొదలవ్వాలి

మన కుటుంబంలో, మన పొరుగున, మన ఆఫీసుల్లో, ఎక్కడైనా సరే, వితంతువుల పట్ల ఉన్న చిన్నచూపును తుడిచేయాలి. వారిని వెలివేయడం కాదు, మన గుండెలకు హత్తుకోవాలి. వారు అపశకునం కాదు, అనురాగానికి ప్రతిరూపాలు. వారికి సమానత్వం ఇవ్వడం మనం చేస్తున్న సాయం కాదు, అది వారి హక్కు. ప్రతి ఒక్కరం మన పరిధిలో ఈ వివక్షకు వ్యతిరేకంగా గొంతు ఎత్తుదాం. మానవత్వమే పరమార్థంగా ఈ సమాజాన్ని మార్చుకుందాం మనం నిజంగా నాగరిక సమాజంలోనే బతుకుతున్నామా? అనే ప్రశ్నకు సమాధానం మన ఇంట్లో, మన వీధిలో ఉన్న వితంతువుల స్థితిని చూస్తే అర్థమవుతుంది. వారికి ఇచ్చే గౌరవమే మన నాగరికతకు కొలమానం. సామాజిక న్యాయం, మానవ గౌరవం లేని ఏ సాంకేతిక పురోగతీ దేశాభివృద్ధి అనిపించుకోదు. భర్త లేని మహిళ పట్ల మన వైఖరిని మార్చుకోనంత కాలం మనం ఆధునిక యుగంలో ఉన్నామని చెప్పకోవడం ఒక భ్రమ మాత్రమే. ఈ అంధవిశ్వాసాల సంకెళ్లను తెంచాల్సిన సమయం వచ్చేసింది. ఆ మార్పు మన ఇంటి నుంచే, మన ఆలోచన నుంచే ఇప్పుడే మొదలవ్వాలి.

ఇండియా, ఫ్రాన్స్ రక్షణ ఒప్పందం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: భారత్, ఫ్రాన్స్ మధ్య రక్షణ సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. మంగళవారం జరిగిన కీలక భేటీలో ఇరు దేశాలు తమ 10 ఏళ్ల రక్షణ సహకార ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవడంతో పాటు, అత్యాధునిక 'హామర్' క్షిపణులను భారత్‌లోనే తయారు చేసేందుకు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఫ్రాన్స్ రక్షణ మంత్రి క్యాథరిన్ వౌట్రిన్ మధ్య జరిగిన '6వ భారత్‌ఫ్రాన్స్ వార్షిక రక్షణ చర్చల' సందర్భంగా ఈ ఒప్పందాలు జరిగాయి. భారత్ తరపున రక్షణ కార్యదర్శి, ఫ్రాన్స్ తరపున అంతర్జాతీయ సంబంధాలు, వ్యూహాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఈ 10 ఏళ్ల రక్షణ సహకార ఒప్పందంపై సంతకాలు చేశారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ డిఫెన్స్ మధ్య హామర్ క్షిపణుల తయారీకి సంబంధించి జాయింట్ వెంచర్ ఒప్పందం కుదిరింది. దీనివల్ల ఈ శక్తివంతమైన క్షిపణులు ఇకపై భారత్‌లోనే తయారుకానున్నాయి. అంతేకాదు భారత సైన్యం, ఫ్రాన్స్ ల్యాండ్ ఫోర్సెస్ సంస్థల్లో ఇరు దేశాల అధికారులు పరస్పరం విధులు నిర్వహించేలా (రిసిప్రొకాల్ డిప్లాయ్‌మెంట్) ఓ అవగాహనకు వచ్చారు.



ఏప్రిల్‌లో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు!

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: దేశంలో శాససభ పదవీ కాలం ముగియనున్న మరికొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి మధ్యలో ప్రకటించనున్నట్టు ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం తెలిపారు. ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ ఐదు అసెంబ్లీల పదవీ కాలం మే, జూన్‌తో ముగుస్తున్నది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం అధికారులు పర్యటించి ఎన్నికల సంసిద్ధతను అంచనా వేశారు. ప్రస్తుతం ఒక బృందం అస్సాంలో పర్యటిస్తున్నది.

గిగ్ వర్కర్లను సర్కారు పట్టించుకోవట్లేదు

ప్రతిపక్షం నేషనల్ బ్యూర్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: గిగ్ వర్కర్ల ను పట్టించుకోడవంలో కేంద్రం విఫలమైందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గిగ్ వర్కర్ల ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. కేంద్రం, వివిధ రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు వారికి జరుగుతున్న అన్యాయాన్ని చూసీచూడనట్లు వదిలేస్తున్నాయని మండిపడ్డారు. గిగ్ వర్కర్ల కోసం బలమైన చట్టాలు లేవని, వారికి సామాజిక భద్రత లేదని, గిగ్ కంపెనీలకు ఎటువంటి జవాబుదారీతనం లేదని ఆయన దుయ్యబట్టారు. ఈ మేరకు రాహుల్ గాంధీ తన ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.

అయితే ఆయన కొన్నిరోజుల క్రిత 'జన్ సంసద్'లో గిగ్ వర్కర్ల ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఆ వీడియోను తాగా పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ వేదికగా కేంద్రంపై విమర్శలు గుప్పించారు.

యువరాజ్ సమ్రా రికార్డు సెంచరీ

రత సంతతికి చెందిన కెనడా ఓపెనర్ యువరాజ్ సమ్రా అరుదైన రికార్డ్ సృష్టించాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడిగా ఘనత సాధించాడు. చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ రికార్డు సాధించాడు. కేవలం 58 బంతుల్లోనే యువరాజ్ సెంచరీ నమోదు చేశాడు. ఫలితంగా 19 సంవత్సరాల 141 రోజులు వయసులోనే టీ20 వరల్డ్ కప్‌లో సెంచరీ చేసిన బ్యాటర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇప్పటి వరకు ఈ రికార్డ్ పాకిస్థాన్ బ్యాటర్ అహ్మద్ షెహజాద్ పేరిట ఉండేది. అతడు 22 సంవత్సరాల 127 రోజుల వయసులో టీ20 వరల్డ్‌కప్‌లో శతకం బాదాడు.

నేడు ఇండియా, నెదర్లాండ్స్ మ్యాచ్
గెలుపు ఊపులో భారత్

ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ముచ్చటగా మూడోసారి టైటిల్‌ను ఒడిసిపట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్న టీమ్‌ఇండియా గ్రూపు దశలో ఆఖరి పోరుకు సిద్ధమైంది. బుధవారం నెదర్లాండ్స్‌తో భారత్ తలపడనుంది. అమెరికా, నమీబియా, పాకిస్థాన్‌పై వరుస విజయాలతో మంచి దూకుడు మీదున్న సూర్యకుమార్‌యాదవ్ సేన ఇప్పటికే సూపర్ 8 బెర్తు దక్కించుకుని కప్ వేటలో మరో అడుగు వేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అంతగా అనుభవం లేని నెదర్లాండ్స్‌ను ఓడించి కీలకమైన సూపర్ 8కు ముందు ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకోవాలని చూస్తున్నది. అయితే గత మూడు మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియా బ్యాటర్లు స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఒకింత ఇబ్బందులు పడ్డారు. నమీబియా కెప్టెన్ గెరార్డ్ ఎరాస్మస్‌తో పాటు గత మ్యాచ్‌లో పాక్ స్పిన్నర్లు ఉస్మాన్ తారిఖ్, సయిమ్ ఆయూబ్ బౌలింగ్‌లో పరుగులు రాబట్టడంలో అంతగా సఫలం కాలేకపోయారు. ఈ నేపథ్యంలో నెదర్లాండ్స్ మ్యాచ్ ద్వారా ఆ లోపాలను సరిదిద్దుకునే పనిలో పడ్డారు. మంగళవారం మోతెరా స్టేడియంలో జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో యువ బ్యాటర్లు తిలక్‌వర్మ, రింకూసింగ్‌కు చీఫ్ కోచ్ గౌతం గంభీర్ సూచనలు ఇస్తూ కనిపించాడు. ఇదిలా ఉంటే స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చే చాన్స్ కనిపిస్తుండగా, సిరాజ్, అర్ష్‌దీప్‌సింగ్‌తో అటాకింగ్ చేయనుంది. ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న అభిషేక్‌శర్మ ఈ మ్యాచ్‌లోనైనా ఖాతా తెరుస్తాడా అన్నది చూడాలి.

ప్రపంచ కప్ నుండి
ఆస్ట్రేలియా ఔట్

ప్రపంచకప్‌లో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా ప్రస్థానం అధికారికంగా ముగిసింది. జింబాబ్వే, ఐర్లాండ్ మధ్య మంగళవారం జరుగాల్సిన గ్రూపుబీ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. ఎడతెరిపిలేని వర్షంతో కనీసం ఒక్క బంతి పడకుండానే ముగిసింది. మైదానం పూర్తిగా చిత్తడిగా మారడం, ఆటకు ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే ఆసీస్ మెగాటోర్నీకి దూరం కాగా, ఒక పాయింట్ ఖాతాలో వేసుకున్న జింబాబ్వే సూపర్ 8 బెర్తు దక్కించుకుంది. గ్రూపుబీ నుంచి ఆతిథ్య శ్రీలంకతో పాటు జింబాబ్వే తదుపరి రౌండ్‌కు అర్హత సాధించగా, ఆసీస్, ఐర్లాండ్, ఒమన్ ఇంటిబాట పట్టాయి. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒక దాంట్లో గెలిచి రెండింటిలో ఓడిన కంగారూలు తమ ఆఖరి లీగ్ పోరులో ఈనెల 20న ఒమన్‌తో తలపడనున్నారు. 2009 తర్వాత ఆసీస్ గ్రూపు దశలోనే నిష్క్రమించడం ఇది తొలిసారి. టోర్నీకి ముందే స్టార్ బౌలర్లు ప్యాట్ కమిన్స్‌తో పాటు జోష్ హాజిల్‌వుడ్ దూరం కాగా, తొలి రెండు మ్యాచ్‌లకు రెగ్యులర్ కెప్టెన్ మిచెల్ మార్ష్ గాయంతో అందుబాటులో లేకుండాపోయాడు. మెగాటోర్నీలో టైటిల్ ఫేవరేట్లలో ఒకటిగా భావించిన ఆసీస్ గ్రూపు దశలోనే వెనుదిరుగడంతో ఆ దేశ అభిమానులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. గ్రూపుఏ మినహా అన్ని గ్రూపుల నుంచి సూపర్ 8 బెర్తులు ఖాయం కాగా, మిగిలిన ఒక బెర్తు కోసం అమెరికా, పాకిస్థాన్ మధ్య పోటీ కొనసాగుతున్నది.

స్కాట్లాండ్‌పై నేపాల్ ఘన విజయం

ముంబయిలోని వాంఖడే స్టేడియంలో జరిగిన 2026 టీ20 ప్రపంచకప్ గ్రూప్‌సి ఆఖరి పోరులో నేపాల్ 7 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై ఘనవిజయం సాధించింది. ఈ విధంగా ఈ మెగా టోర్నీలో నేపాల్ తన తొలి గెలుపును నమోదు చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో నేపాల్ 19.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 171 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ ఓపెనర్లు మైకేల్ జోన్స్ (71 పరుగులు, 45 బంతులు), జార్జ్ మున్సే (27 పరుగులు) శుభారంభాన్ని ఇచ్చారు. పవర్‌ప్లే ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసిన స్కాట్లాండ్, ఒక దశలో 132/1తో భారీ స్కోరు దిశగా సాగింది. అయితే నేపాల్ సీనియర్ పేసర్ సోంపాల్ కామీ ఒకే ఓవర్లో జోన్స్, బ్రాండన్ మెక్‌ముల్లెన్‌లను అవుట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. చివరి 5 ఓవర్లలో స్కాట్లాండ్ కేవలం 39 పరుగులు మాత్రమే చేసి 6 వికెట్లు కోల్పోయింది. 171 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్‌కు ఓపెనర్లు కుశాల్ భుర్టెల్ (43), ఆసిఫ్ షేక్ (33) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. మధ్యలో కెప్టెన్ రోహిత్ పౌడెల్ (16) అవుట్ అయినా, స్టార్ ఆల్‌రౌండర్ దీపేంద్ర సింగ్ ఐరీ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 23 బంతుల్లోనే 50 పరుగులు చేసి (4 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. అతనికి తోడుగా గుల్షన్ ఝా (20 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

అవకాశాల కోసం
శ్రమించా

కెరీర్ తొలినాళ్లలో అవకాశాల కోసం ఎంతో శ్రమించానని, దర్శకుల దగ్గరకు వెళ్లి తనకు సూటయ్యే పాత్ర ఉంటే ఇవ్వమని అడిగిన సందర్భాలెన్నో ఉన్నాయని గుర్తు చేసుకుంది అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం ఈ భామ దక్షిణాదితో పాటు హిందీలో కూడా సత్తా చాటుతున్నది. 2019లో 'సూపర్ 30'తో హిందీలో కథానాయికగా అరంగేట్రం చేసిన ఈ సొగసరి ప్రస్తుతం బాలీవుడ్‌లో మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో కెరీర్ తొలినాటి రోజుల్ని గుర్తు చేసుకుంది మృణాల్ ఠాకూర్. 'అవకాశాలు నా దగ్గరకు ఎప్పుడూ రాలేదు. వాటిని నేను సృష్టించుకున్నాను. దర్శకుల దగ్గరకు నేరుగా వెళ్లి మంచి పాత్ర కోసం అభ్యర్థించిన రోజులున్నాయి. నటనంటే అమితమైన ప్రేమ కాబట్టి ఎలాంటి సంకోచం లేకుండా అవకాశాల కోసం అడిగేదాన్ని' అని మృణాల్ ఠాకూర్ చెప్పకొచ్చింది. శ్రీదేవి నటించిన 'మామ్' సినిమా తనను ఎంతగానో ఆకట్టుకుందని, దర్శకుడు రవి ఉద్యవార్‌ని కలిసి అలాంటి సీరియస్ కథ ఉంటే తనను పరిగణనలోకి తీసుకోమని కోరానని మృణాల్ తెలిపింది. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో హిందీలో 'దో దివానే సెహర్ మే' అనే చిత్రంలో నటించడం సంతోషంగా ఉందని చెప్పింది. అడివి శేష్‌తో మృణాల్ నటించిన 'డెకాయిట్' సినిమా పానిండియా స్థాయిలో త్వరలోనే విడుదల కానుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200